## సంతాపం తెలిపి, పరిహారం ఇస్తే సరిపోదు: పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి

ఈ ప్రమాదం వెనుక సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్టుగా తెలుస్తోందని చెప్పారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని గతంలో చాలా సార్లు చెప్పామని అన్నారు. ప్రజలు, కార్మికుల భద్రత కోసం సేఫ్టీ ఆడిట్ చేయించాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ శాఖ తన పరిధిలో ఉందని... భద్రత వేరే శాఖ కిందకు వస్తుందని అన్నారు. మంగళగిరిలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి వారం ఏదో ఒక ప్రమాదం జరగడం బాధను కలిగిస్తోందని పవన్ చెప్పారు. సంతాపం తెలిపి, పరిహారం ఇస్తే సరిపోదని అన్నారు. రాబోయే 3 నెలల్లో పరిశ్రమల భద్రతపై కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పవన్ తెలిపారు. పంజాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతంపై ఎన్డీయే కూటమి హామీ ఇచ్చిందని చెప్పారు. పంచాయతీ రాజ్ మలిదశ సంస్కరణలు మొదలుపెట్టామని తెలిపారు. ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

## హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ :ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి వ్యతిరేకంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు టీపీసీసీ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర సంస్థల్ని తమ గుప్పిట్లో పెట్టుకొని కొందరికి మాత్రమే లబ్ధి చేకూరేలా ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా అదానీకి లబ్ధి చేకూరుస్తున్నారని, దీనిని నిరసిస్తూ దేశంలోని అన్ని ఈడీ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ పార్టీ గురువారం నాడు ఆందళనలు నిర్వహించింది. ఇందులో భాగంగా రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... అదానీ వ్యవహారాన్ని చట్టసభల్లో రాహుల్ గాంధీ బయటపెట్టారన్నారు. భారత్‌కు రూ.183 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, ఇందులో 16 మంది ప్రధానులు చేసిన అప్పుల కంటే ప్రస్తుత ప్రధాని మోదీ రెండింతలు అప్పుచేశారని విమర్శించారు. తన పరివారాన్ని కాపాడుకోవడానికే ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ మెగా కుంభకోణంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సెబీ చైర్ పర్సన్ అక్రమాల పైనా జేపీసీ వేయాలన్నారు. ఇప్పుడు తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఉందన్నారు. కాగా, ఈ ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి సత్యం విజయం సాధిస్తుందని ప్లకార్డును ప్రదర్శించారు.

అదానీ ఆస్తులపై ఈడీకి ఫిర్యాదు

సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ధర్నా అనం తరం అదానీ ఆస్తుల వ్య వహారంపై ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అదానీ కుంభకోణంపై విచారణ జరపాలని వినతిపత్రం ఇచ్చారు.

## ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు కావాలి

అమారవతి: మహిళలపై హింస విషయంలో చాలా కఠినంగా ఉండాలని, ఆడ బిడ్డల జోలికి వస్తే ..అదే తనకు చివరి రోజు అనే విషయం నేరస్తులకు అర్థం కావాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పోలీసింగ్ లో స్పష్టమైన మార్పు కనిపించాలని, నేరం చేస్తే శిక్ష తప్పదు అనే భయం కనిపించేలా పోలీసు శాఖ పని చేయాలని సూచించారు. నేరం జరిగిన తర్వాత నేరస్తులను పట్టుకోవడం, శిక్షించడం ఒక ఎత్తు అయితే ..అసలు నేరం చేయాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాలన్నారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో హోంశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావుతో పాటు పోలీస్ శాఖలోని ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత విషయంలో గట్టి భరోసా ఇచ్చేలా పోలీసు శాఖ పని చేయాలని, పూర్తి స్థాయి శాంతి భద్రతలతో మళ్లీ ప్రశాంతమైన రాష్ట్రంగా ఏపీ కనిపించాలని చెప్పారు. రాజకీయ ముసుగులో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని సీఎం అన్నారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో, నేరాల విచారణ, నేరస్తులకు శిక్షల విషయంలో అధికారులు ఫలితాలు కనిపించేలా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. సమీక్షలో తొలుత గత పదేళ్లలో పోలీసు శాఖలో నెలకొన్న పరిస్థితులపై సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. సమీక్ష అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ సమావేశం వివరాలను వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం సీసీ కెమెరాల బిల్లులు కూడా చెల్లించలేదని విమర్శించారు. సీసీ కెమెరాల నిర్వహణ కూడా సరిగ్గా లేదని అన్నారు. మహిళల భద్రత గురించి వైసీపీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

## మోదీ గారూ... మీ ప్రవర్తన చాలా సిగ్గుచేటు

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. ప్రముఖ వ్యాపారవేత్త అదానీని కాపాడేందుకు మోదీ కుటిల యత్నాలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా బ్రిటీష్ వారిపై పోరాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆమె అన్నారు. అలుపెరుగని పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిందని చెప్పారు. మోదీ హయాంలో కార్పొరేట్ శక్తులు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని... ప్రజల ఆస్తులను దోచుకుంటున్నాయని విమర్శించారు. ప్రజలను లూటీ చేస్తున్న జలగలను తరిమికొడతామని చెప్పారు. కార్పొరేట్ల చేతిలో ఉన్న రిమోట్ కంట్రోల్ తో మోదీ సర్కార్ నడుస్తోందని అన్నారు. దేశాన్ని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ మరో పోరాటం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంస్థలను జేబు సంస్థలుగా మార్చుకుని, ప్రతిపక్షాల మీద కక్షపూరిత దాడులకు పాల్పడే మోదీ నియంత పాలనపై కాంగ్రెస్ పోరాడుతుందని అన్నారు. అదానీ కోసం దేశాన్ని దారుణ పరిస్థితుల్లోకి మోదీ నెట్టేశారని చెప్పారు. అదానీ వ్యాపారాలపై దర్యాప్తును ప్రారంభించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అదానీ విషయంలో మోదీ ప్రవర్తిస్తున్న తీరు సిగ్గుచేటని మండిపడ్డారు.

## బీఆర్ఎస్ సన్నాసులను నమ్ముకుని ఆగం కావొద్దు

మొదటి పేజి తరువాయి

రేవంత్ రెడ్డి మరోసారి ఫైర్ అయ్యారు. ఆ పార్టీని నమ్ముకుని ఆగం కావొద్దని రైతులకు సూచించారు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం 100 శాతం కట్టుబడి ఉందని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని... త్వరలోనే ప్రతి రైతు రుణం మాఫీ అవుతుందని చెప్పారు. రుణమాఫీ కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... రాష్ట్రంలో మన ప్రభుత్వం అధికారంలో ఉందనే విష యాన్ని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. రైతుల విషయంలో కొందరు దొంగ దీక్షలు చేస్తున్నారని రేవంత్ మండి పడ్డారు. సన్నాసులను నమ్ముకుని రైతులు రోడ్డెక్కాల్సిన అవసరం లేదని... మీ సమస్యలను వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పదేళ్లు దోచుకున్నవాళ్లను, ఆరు నెలల క్రితం బొంద పెట్టి నవాళ్లను మళ్లీ గ్రామాల్లోకి ఎందుకు రానిస్తున్నారని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీ అబద్ధా లను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో కేటీఆర్ పచ్చి అబద్ధాలు ఆడు తున్నారని విమర్శించారు. రూ. లక్ష రుణమాఫీ చేసేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆపసోపాలు పడిందని ఎద్దేవా చేశారు.

## మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం ప్రకటించిన చంద్రబాబు



అమరావతి : అచ్యుతాపురం సెజ్ లోని ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఈరోజు విశాఖపట్నం చేరుకున్న ఆయన... నేరుగా మెడికవర్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. బాధితులు త్వరగా కోలుకునేలా ప్రభుద్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బాధితుల కుటుంబ సభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. ఎవరూ భయపడొద్దని, ధైర్యంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడుతూ... ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం కలచివేసిందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి చెప్పున పరిహారం అందజేస్తామని తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 60 రోజులు మాత్రమే అవుతోందని... ఈ ప్రమాదానికి ఎవరు కారణమని ప్రశ్నించారు. వైసీపీ తప్పులు చేసి... ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శిస్తోందని మండిపడ్డారు.

# చంద్రబాబు మార్క్ ఇంకా ఏపీలో కనపడలేదా ?

మొదటి పేజి తరువాయి

ఇక 2014 నుంచి 2019 దాకా విభజన ఏపీలో కూడా ఆయన తన పద్ధతిలో పాలన సాగించారు. ఇపుడు నాలుగవ సారి ఏపీకి సీఎం అయిన చంద్రబాబు తన మార్క్ వేస్తున్నారా అన్నదే చర్చనీయాంశంగా మారింది. ఏపీలో చంద్రబాబు వస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుంది అనుకున్న వారికి ఇపుడు కొంత నిరాశ అయితే తప్పడం లేదు. ఇంకా ఆ దిశగా సంకేతాలు ఏవీ లేకపోవడమే దానికి కారణం. దీంతో ప్రజలు బాబు మార్క్ ఏదీ అని చర్చించు కుంటున్నారు. ఇక ప్రభుత్వం బయటకు ఏమీ చెప్పకపోయినా పాలన సాగుతున్న తీరు అడపా తడపా కూటమి మంత్రులు నేతలు ఇస్తున్న ప్రకటనలు బట్టి చూస్తే ఈ ఏడాదికి సంక్షేమ పథకాలు అన్నవి లేవు అన్న క్లారిటీ వస్తోంది. బాబు వస్తే రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుంది అని భావించినా ఆ రంగం కూడా ఏపీలో ఏమీ పెద్దగా పెరగలేదు. దాంతో పాటు నగదు బదిలీ పథకాలు ఏవీ జనాలకు చేరలేదు. మరో వైపు చూస్తే అభివృద్ధి అన్నది కూడా పట్టాలెక్కలేదు. సగటు జనం తీరు ఎలా ఉంది అంటే అభివృద్ధి కావాలా డబ్బులు కావాలా అంటే డబ్బులే కావాలని అంటున్నారు. జగన్ డబ్బులు ఇచ్చినా ఓట్లు ఆయనకు రాలేదు, ఘోరంగా అధికారం నుంచి దిగిపోయారు. ఆ విషయమే కూటమిలో చర్చగా ఉంది. అలాగని పథకాలను ఆపేస్తే మాత్రం మొదటికే మోసం వస్తుంది అని అంటున్నారు. ఇది సాదా జనం చెప్పే మాట కాదు మేధావులు అంటున్న మాట. మరో వైపు చూస్తే జగన్ ఓడినా 40 శాతం ఓట్లు వచ్చాయి అంటే అవి నగదు బదిలీ పథకాల వల్లనే అని కూడా విశ్లేషిస్తున్నారు. అయితే జగన్ చేసిన తప్పు ఏమిటి అంటే అభివృద్ధి ఏమీ ఏపీలో చేయకుండా కేవలం నగదు బదిలీ పథకాలు నమ్ముకోవడం. దాని వల్లనే ఆయన నిండా మునిగారు అని అంటున్నారు. ఇక జగన్ ఎమ్మెల్యేల మీద కంట్రోల్ పెట్టుకోలేకపోయారు. అదే సమయంలో వారితో ఒక్క సమావేశం కూడా నిర్వహించలేక పోయారు. ప్రజల నుంచి గెలిచి వచ్చిన ఎమ్మెల్యేలకు ఏ మాత్రం అధికారం లేకుండా చేసి వాలంటీర్లను తెచ్చి నెత్తిన పెట్టారు. దాంతో జగనే దారుణంగా ఓటమి చూసారు. ఈ మొత్తం వ్యవహారంలో క్యాడర్ కూడా ఫుల్ సైలెంట్ కావడమే వైసీపీకి కొట్టిన శాపం అని కూడా అంటున్నారు. క్యాడర్ కి ఏమీ చేయకపోవడమే జగన్ చేసిన మరో తప్పు అని అంటున్నారు. అదే చంద్రబాబు విషయం తీసుకున్నా క్యాడర్ కి ఏమీ ఇప్పటిదాకా అయితే చేయలేదు అని అంటున్నారు. ఓట్లేసి భారీ మెజారిటీతో బంపర్ సీట్లు ఇచ్చిన ప్రజలకు కూడా బాబు ఏమీ చేయలేదు. అన్నా క్యాంటీన్లు అన్నది పెద్ద సంక్షేమ పథకం ఏమీ కాదు. ప్రైవేట్ గా కూడా దాతలు చాలా మంది భోజనం పెడుతున్నారు. అలా నిత్యాన్నదానం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉంటాయి. ఇదంతా ఎవరి ఆర్థిక స్తోమత ఎంత అన్న దానిని బట్టి ఉంటుంది. ఈ రోజులలో చూస్తే జనాలు చాలా తెలివి అయిన వారుగా చెప్పాలి. వారు ఏ ఒక్కటీ మిస్ కారు. అన్నింటినీ గమనిస్తూనే ఉంటారు. బాబు పథకాలను ఎపుడు ఇస్తారు అన్నది కూడా ఎదురు చూస్తున్నారు. అలాగే మద్యం ధరలు ఎపుడు తగ్గిస్తారు అని కూడా ఆలోచిస్తున్నారు. హామీ మేరకు మద్యం ధరలను తగ్గించి నాణ్యమైన మందును అందించవచ్చు. కానీ అలా ఒక్కసారిగా మద్యం ధరలను తగ్గిస్తే ఆదాయం తగ్గి రాష్ట్ర ఖజానా వెలవెలబోతోంది అని అధికారులు ప్రభుత్వానికి చెబుతున్నారు. ఇక గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరూ ఖాళీగా ఊరుకోరు కదా. అందుకే వారు పని మొదలెట్టేశారు అని అంటున్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారింది అని అంటున్నారు. ఈ మేరకు నివేదికలు కూడా కూటమి సర్కార్ పెద్దల వద్దకు వెళ్లాయని అంటున్నారు. జగన్ కి ఎమ్మెల్యేల మీద కంట్రోల్ ఎలా లేదో బాబుకు కూడా అదే విధంగా ఎమ్మెల్యేల మీద కంట్రోల్ లేకుండా పోయింది అని కూడా అంటున్నారు. ఎందుకు అంటే ఉద్యోగులు అధికారుల బదిలీ విషయంలోనే ఎమ్మెల్యేలు చాలా ముందుకు పోయారు. డబ్బులు పెద్ద ఎత్తున చేతులు మారాయి అన్న ప్రచారంలో వాస్తవాలు ఏమిటి అన్నది తెలియాల్సి ఉంది. మరో వైపు చూస్తే ప్రపంచం అంతా ఆర్థిక మాంద్యం ఉంది.ఈ నేపథ్యంలో హెచ్ సీ ఎల్ ఏకంగా ఏపీలో 15000 ఉద్యోగాలు సృష్టించి ఇవ్వగలదా అన్నది కూడా మరో చర్చగా ఉంది. దీని మీద కూటమి పెద్దలు చెబుతున్నది కూడా ఆలోచించాల్సి



ఉంది అని అంటున్నారు. ఒక వైపు చూస్తే అమెరికాలో పెద్ద ఎత్తున జాబ్ మార్కెట్ అయితే పడిపోయింది అని అంటున్నారు. కానీ హెచ్ సీ ఎల్ మాత్రం సాప్ లో ఏకంగా 15 వేల ఉద్యోగాలు ఎలా ఇవ్వగలదు అన్న చర్చ కూడా ముందుకు వస్తోంది. ఇక చంద్రబాబు అసలు సిసలు ప్రయారిటీ అయిన అమరావతి రాజధాని విషయంలో ప్రపంచ బ్యాంకు పదిహేను వేల కోట్ల రూపాయలు అప్పు ఇస్తుంది అని తెగ ఊదరగొడుతున్నారు. ఆ పదిహేను వేల కోట్లు అమరావతి రాజధానికి ఏ మేరకు సరిపోతాయని కూడా ప్రశ్నలు ఉన్నాయి. లక్ష కోట్లు ఉంటేనే కానీ అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పన అన్నది జరగదు అని అంటున్నారు. ఇక ఏపీలో మరో భారీ ప్రాజెక్టు పోలవరం విషయం చూస్తే కేంద్రం ఏమి ఇస్తుంది అన్నది ఎవరికీ తెలియదు. పదేళ్లలో కేవలం 15 వేల కోట్లు మాత్రమే ఇచ్చిన కేంద్రం ఇపుడు దానికి నాలుగు రెట్లు ఒకేసారి ఇచ్చి పోలవరం పూర్తి చేస్తుందా అన్నది పెద్ద ప్రశ్న. మొత్తం మీద చూసుకుంటే అటు డెవలప్మెంట్ కానీ ఉపాధి రంగం కానీ అలాగే సంక్షేమ పథకాలు కానీ ఏవీ కూడా ఇంకా ఒక అస్పష్ట రూపంలోనే ఉన్నాయి. చంద్రబాబు అయితే సమీక్షల మీద సమీక్షలు నిర్వహిస్తున్నారు. వాటి అవుట్ పుట్ ఏంటి అంటే ఖజానా ఖాళీ అని జనాలకు చెప్పడమే. ఆ మాటలు నమ్మి జనాలు ఊరుకుంటారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# విగ్రహాల చుట్టూ తిరుగుతోన్న తెలంగాణ రాజకీయం..

మొదటి పేజి తరువాయి

అసలు అక్కడ రాజకీయ నాయకుల విగ్రహాలు వద్దే వద్దంటూ షాకిచ్చారు ఓ బీజేపీ ఎమ్మెల్యే. తెలంగాణ సచివాలయంలో మా నాయకుడు రాజీవ్ విగ్రహం పెడతామని కాంగ్రెస్ అంటే.. మేం అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాన్ని తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం పెడతామని కౌంటర్ ఇచ్చింది బీఆర్ఎస్. మీరు మీరు విగ్రహాలు పెట్టుకుంటూ ఉంటే మేం చూస్తూ ఊరుకోవాలా అంటూ బీజేపీ లైన్లోకి వచ్చేసింది. అక్కడ మాజీ ప్రధాని వాజ్ పేయ్ విగ్రహం పెట్టాలని మాకూ ఉంది కానీ మేం ఇప్పుడు ఆ చర్చ పెట్టడంలేదంటోంది. ఇలా గత కొంత కాలంగా తెలంగాణలో రాజకీయం మొత్తం విగ్రహాల చుట్టూనే నడుస్తోంది. తెలంగాణ సచివాలయం పరిసరాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, పి.వి నరసింహారావు విగ్రహాలు ఉన్నాయి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఇక్కడ లేకపోవడం లోటుగా ఉందని సచివాలయంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సచివాయంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.




రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేసిన వెంటనే రియాక్టయ్యారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆలస్యం చేసి వందలాది అమరవీరుల ప్రాణాలు బలిగొన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజీవ్ గాంధీ విగ్రహా ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. మరో నాలుగేళ్లలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని.. అప్పుడు సచివాయలంలో రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించి ఆ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతామన్నారు కేటీఆర్. రుణమాఫీ అంశంపై ప్రజల్లో చర్చ జరగకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి విగ్రహ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు బండి సంజయ్. విగ్రహాల మీద జరుగుతున్న చర్చ అనవసరమని సచివాలయంలో వాజ్‌పేయి విగ్రహం పెట్టాలని మాకు కూడా ఉందని..ఎవరి విగ్రహం పెట్టాలో ప్రజలనే అడుగుదామని ఆయన అన్నారు. సచివాలయంలో వై నాట్ వాజ్‌పేయి విగ్రహం అని బండి సంజయ్ అంటే.. దానికి పూర్తి విరుద్ధంగా అసలు రాజకీయ నాయకుల విగ్రహాలే అవసరం లేదంటూ షాకిచ్చారు బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి. వీలైతే నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం లేదా, తెలంగాణ సస్యశ్యామలంగా ఉండటానికి కారణమైన రాణి రుద్రమదేవి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు రాకేష్ రెడ్డి. మొత్తానికి సచివాయలంలో విగ్రహాల ఏర్పాటుపై తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీల ప్రకటనలు చూస్తుంటే కాదేది రాజకీయాలకు అనర్హం అనే విషయం రుజువవుతోంది.

## సొంత జిల్లా నుంచి ప్రక్షాళన షురూ..!

మొదటి పేజి తరువాయి

ముందుగా సొంత ఇంటిని చక్కదిద్దుకునే పనిలో జగన్ ఉన్నారు. అందుకే సొంత జిల్లాల నుంచే ప్రక్షాళన షురూ చేశారు. ముందుగా కడప, అన్నమయ్య జిల్లాల ఇంచార్జ్‌లను మార్చి తనదైన శైలిలో రాజకీయాలను మొదలుపెట్టారు. మొదట సొంత జిల్లాను చక్కదిద్దుకోగలిగితే, రాష్ట్రంలోని మిగిలిన క్యాడర్ అంతా చక్కదిద్దుకుంటుందని జగన్ భావిస్తున్నారట. ఈ క్రమంలోనే తన సొంత జిల్లా నేతలకు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తుంది. ఉమ్మడి కడప జిల్లా వైసీపీకి కంచుకోటగా ఉండేది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఈ కోటకు బీటలు బారాయి.. ఉమ్మడి కడప జిల్లాలోని 10 నియోజకవర్గాలలో మూడు అంటే మూడు స్థానాల్లో మాత్రమే వైసీపీ గెలుచుకోగలిగింది. ఇంతవరకు ఇలాంటి పరాభవాన్ని ఎప్పుడూ చెవిచూడలేదు. గతంలో వైఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా ఉన్న ఉమ్మడి కడప జిల్లా, వైఎస్ మరణానంతరం వైఎస్ జగన్ పెట్టిన వైసీపీకి కంచుకోటగా మారింది. అయితే రెండు దఫాలుగా తమ సత్తాను చాటి, కడప జిల్లాలో తమకు ఎదురు లేదు అంటూ నిలిచిన వైసీపీ నేతలు ఈసారి చతికిలాపడక తప్పలేదు. ఎన్డీయే కూటమి హవాకు వైసీపీ తోక ముడిచింది. కేవలం మూడు అంటే మూడు సీట్లు మాత్రమే గెలుచుకొని తమ పట్టును కోల్పోయింది. అందుకే జగన్ పార్టీలో ఏ విధమైన ఇబ్బందులు రాకుండా ముందుగా నేతలలో ధైర్యాన్ని నింపే పనిలో పడ్డారు. దానికోసం జిల్లాలో ప్రక్షాళన మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే ఆగస్ట్ 21వ తేదీన జిల్లాలోని ముఖ్య నేతలు కార్యకర్తలకు ఫోన్లు చేసి తాడేపల్లికి రమ్మన్నారు. ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన జడ్పీ చైర్మన్ పదవిని టీడీపీ కొట్టుకుపోకుండా ముందస్తుగా చర్యలు తీసుకుని వెంటనే జడ్పీ చైర్మన్ ని నియమించారు. భీమటం చెందిన జడ్పిటిసి రామ గోవిందరెడ్డిని జడ్పీ చైర్మన్‌గా ఖరారు చేశారు. ఇక మిగిలినవి జిల్లా అధ్యక్ష పదవులు ఇందులో గతంలో కడప జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన సురేష్ బాబు ఉండగా, అన్నమయ్య జిల్లాకు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే వీరి ఇరువురిని ఇప్పుడు మారుస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే కడప జిల్లాకు సొంత మేనమామ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. అలాగే ఆయన కుమారుడు నరేన్ రామానుజన్ రెడ్డిని కమలాపురం ఇంచార్జ్‌గా నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శ్రీకాంత్ రెడ్డిని అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని జిల్లా అధ్యక్షులుగా నియమించారు. అయితే ఇప్పుడు రెండు జిల్లాలను కూడా రెడ్లకు కేటాయించడం విశేషం. అంతేకాకుండా కడప నగరంలో బీసీ నేతగా వైఎస్ కుటుంబానికి ఎంతో సన్నిహితుడిగా ఉన్న సురేష్ బాబును కాదని కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అధ్యక్ష పదవి కట్టబెట్టారు. అయితే అన్నమయ్య జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డికి అలాగే కడప జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్ బాబుకి ఇద్దరికీ కూడా పార్టీలో రాష్ట్ర నాయకత్వంలో సంచిత స్థానాలు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. శ్రీకాంత్ రెడ్డికి అలాగే సురేష్ బాబుకి ఇద్దరికీ కూడా రాష్ట్ర విభాగంలో మంచి స్థానాలు ఇస్తామని హామీ తోనే కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులను మార్పు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లాకు సంబంధించిన నేతలు అధినేత జగన్‌తో సమావేశమై కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రతి ఒక్క నేతతో జగన్ ప్రత్యేకంగా మాట్లాడుతూ పార్టీని పార్టీ భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత నాయకులపై ఉందని దిశానిర్ధేశం చేశారు. రానున్న నాలుగు నెలల పార్టీ కోసం కష్టపడాలని ప్రతి ఒక్కరికి సూచించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పార్టీని మరింత బలోపేతం చేయాలి అంటే ముందు సొంత జిల్లా నుంచే మార్పులు చేర్పులు చేస్తే గాని పార్టీ బలోపేతం కాదు అనే ఉద్దేశంతోనే వైఎస్ జగన్ తనదైన శైలిలో రాజకీయం మొదలుపెట్టారని స్థానిక నేతలు అంటున్నారు. ఘోర పరాజయం పొందిన తరువాత పార్టీ ప్రక్షాళన చేయకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న నేపథ్యంలో సొంత జిల్లా నుంచి ప్రక్షాళన మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

### డాక్టర్ల డిమాండ్లకు దిగొచ్చిన బెంగాల్ ప్రభుత్వం..

## ఆర్‌జీ కర్ ఆసుపత్రి అధికారుల బదిలీ!

ఢిల్లీ : కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో ఆమెకు మద్దతుగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నిరసనలకు మమతా బెనర్జీ ప్రభుత్వం దిగొచ్చింది. ఆర్‌జీ కర్ ఆసుపత్రిలోని ముగ్గురు ఉన్నతాధికారులపై బదిలీ వేటు వేసింది. ఈ మేరకు బెంగాల్ ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్ ఉత్తర్వులు జారీ చేశారు. వారిని, వివిధ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. దీంతోపాటు ట్రైనీ డాక్టర్ మృతిపై అనుచిత వ్యాఖ్యలు చేసి, బదిలీ అయిన ఆర్జీ కర్ వైద్యకళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు నిగమ్ వెల్లడించారు. “ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటనపై జూనియర్ డాక్టర్లు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వారి డిమాండ్ల మేరకు పలు చర్యలు తీసుకున్నాం. డాక్టర్లు వైద్యసేవలు కొనసాగించాలని మనవి చేస్తున్నాం. డాక్టర్ల డిమాండ్ల మేరకు ఆసుపత్రిలో భద్రతను కట్టుదిట్టం చేశాం. ప్రస్తుత పరిస్థితి సాధారణ స్థితికి రావాలని కోరుతున్నాం” అని ఎన్ఎస్ నిగమ్ తెలిపారు. ఇక ప్రస్తుతం నేషనల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ గా కొనసాగుతున్న సందీప్ ఘోష్ నియామకాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ రద్దు చేసింది. ఆయన స్థానంలో ఆర్జీ కర్ ప్రస్తుత ప్రిన్సిపల్ సుహ్రితా పాల్‌ను మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ గా బదిలీ చేసింది. అలాగే ఆమె స్థానంలో ఆర్జీ కర్ ప్రిన్సిపల్ గా మానస్ కుమార్ బంధోపాధ్యాయ నియమితులయ్యారు. దీంతో పాటు ఆర్జీ కర్ ఆసుపత్రి వైస్ ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్ బుల్బుల్ ముఖోపాధ్యాయ స్థానంలో సప్తర్షి ఛటర్జీని నియమించింది. అలాగే ఆర్‌జీకేఎంసీహెచ్ ఔషధ విభాగం అధిపతి అరుణాభ దత్తా చౌధురిని మాల్దా మెడికల్ కళాశాలకు బదిలీ చేస్తూ ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## ‘ఉక్రెయిన్’కు శాంతియుత పరిష్కారం

మొదటి పేజి తరువాయి

పోలండ్, ఉక్రెయిన్ దేశాల పర్యటనకు బయల్దేరేముందు ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పోలండ్ రాజధాని వార్సాకు చేరుకున్న మోదీ శుక్రవారం అక్కడినుంచి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు రైల్లో వెళ్తారు. 1991లో సోవియెట్ యూనియన్ నుంచి విడిపోయి పూర్తిస్థాయి దేశంగా ఉక్రెయిన్ ఆవిర్భవించాక భారత ప్రధాని అక్కడకు వెళ్లడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్‌కు స్నేహితుడిగా, భాగస్వామిగా ఆ ప్రాంతంలో సత్వరం శాంతి, సుస్థిరతలు నెలకొనాలని భారత్ ఆకాంక్షిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. మాస్కోలో ఆరు వారాల క్రితం మోదీ పర్యటించడంపై అమెరికా, కొన్ని పాశ్చాత్య దేశాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఉక్రెయిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనను అమెరికా కూడా స్వాగతించింది. జెలెన్‌స్కీతో మోదీ విడిగా భేటీ కావడంతో పాటు ప్రతినిధుల బృందం స్థాయిలోనూ చర్చలు జరపనున్నారు.

భాగస్వామ్యం మున్ముందుకు :-

“మధ్య ఐరోపాలో భారత్‌కు పోలెండ్ కీలక ఆర్థిక భాగస్వామి. ద్వైపాక్షిక బంధాలకు ఊపునిచ్చేలా భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పోలండ్ అధినేతలతో భేటీ అవుతా. ప్రవాస భారతీయులతోనూ ముచ్చటిస్తా. ఆ తర్వాత కీవ్‌కు వెళ్లనున్నా. రెండేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారంపై జెలెన్‌స్కీతో నా ఆలోచనలు పంచుకునే అవకాశం కోసం ఎదురుచూస్తున్నా” అని మోదీ తెలిపారు. రాబోయే కాలంలో ఆ రెండు దేశాలతో విస్తృత సంబంధాలకు తన పర్యటన ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. భారత ప్రధానుల్లో ఎవరూ గత 45 ఏళ్లలో పోలండ్‌కు వెళ్లలేదు. చివరిసారిగా 1979లో నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలండ్‌ను సందర్శించారు. వార్సాకు చేరుకున్న తర్వాత ‘ఎక్స్’ ద్వారా మోదీ స్పందిస్తూ- తన పర్యటన ఇరు దేశాల ద్వైపాక్షిక స్నేహానికి ఊపుతెచ్చి, ప్రజలకూ లబ్ధి కలిగిస్తుందన్నారు. బసచేసిన హోటల్ వద్ద ప్రవాస భారతీయులు సంప్రదాయబద్ధంగా స్వాగతించడం తననెంతో కదిలించిందని ఆయన పేర్కొన్నారు.

ప్రాధాన్యమున్న పర్యటన ఇది: అమెరికా :-

రష్యాతో భారత్‌కున్న చిరకాల బంధాన్ని తాము అర్థం చేసుకోగలమని, ఉక్రెయిన్‌లో మోదీ పర్యటన ప్రాముఖ్యమున్నదని అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ ఉప మంత్రి రిచర్డ్ వర్మ పేర్కొన్నారు. సాధారణ పౌరుల్ని, ఆసుపత్రుల్లో పిల్లల్ని కూడా చంపడం ద్వారా ప్రపంచంలో అస్థిరతకు రష్యా ప్రయత్నిస్తోందని విమర్శించారు.

## జనగణనకు మోక్షం.. వచ్చే నెల నుంచి జనాభా లెక్కలు షురూ?

న్యూఢిల్లీ, : సెప్టెంబరు నుంచి దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు ఇద్దరు ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారని రాయిటర్స్ న్యూస్ ఏజెన్సీ ఒక కథనంలో పేర్కొన్నది. దేశంలో ప్రతి పదేండ్లకు ఒకసారి జనగణన జరుగుతున్నది. ఈ లెక్కన 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు వచ్చే నెల నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్టు సమాచారం.




18 నెలల పాటు ప్రక్రియ

జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026 మార్చిలో ప్రభుత్వ గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ప్రధానమంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్టు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ పేర్కొన్నది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్నది. జనగణనతో ఈ విషయం అధికారికంగా వెల్లడి కానున్నది.

గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక



## ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు జిల్లాలో అర్హులైన బాలలు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా.

ఏటూరునాగారం(ములుగు)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: ములుగు జిల్లాలోని అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన ప్రతిభావంతులైన 5-18 సంవత్సరాలలోపు బాల బాలికల నుండి ప్రధాన మంత్రి బాల పురస్కారాల కోసం దరఖాస్తులనుఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి జె.ఎమ్. స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ దరఖాస్తులను పిల్లలేనేరుగాసమర్పించవచ్చని,లేదా వారి తరపున తల్లితండ్రులు, సంబంధీకులు లేదాపౌరులెవరైనాదరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు. అలాగే వివిధ సందర్భాల్లో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన పిల్లల తరపున పిల్లల హక్కులు మరియు వారి సంరక్షణ కొరకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని అన్నారు. అదేవిధంగా వివిధ నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు - సంస్కృతి, శాస్త్ర - సాంకేతిక అంశాలలో/రంగాల్లో అసమాన ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన 5-18 సం.లోపు వయస్సున్న చిన్నారులు కూడా ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఈ దరఖాస్తులు కేవలం ఆన్ లైన్ విధానం లో మాత్రమేస్వీకరించబడతాయని, కావున అర్హులైన వారు https://awards.gov.in వెబ్ సైట్ లో ఆగష్టు 31 లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇట్టి దరఖాస్తులలో సమాచారం కొరకు బాల రక్షాభవన్ ములుగు నందు లేదా 9440615158 నెంబర్ కి సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు.


## అర్హులైన దివ్యాంగులకు ఈ శిబిరం ద్వారా వివిధ రకాలైన వైకల్యాలలో అర్హులైన ఉపకరణాలు

### సీడీపీవో ఏటూరునాగారం.

ఏటూరునాగారం**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన సహాయ ఉపకరణాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అంతేకాకుండా జిల్లాలోని అంధులైన బాల బాలికలు పాఠశాలల్లో/కళాశాలలో చదువుతున్న వారు వారి వైకల్యం 40 శాతం పైన ఉన్నటువంటి వారికి స్మార్ట్ ఫోన్ లను కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈఎంపిక మరియు నమోదు శిబిరానికిఅర్హులైనదివ్యాంగులు ఈ క్రిందతెలిపినధ్రువపత్రాలతో రేపు ఏర్పాటు చేయబోయే శిబిరానికి హాజరు కాగలరు. 1.పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు- 2. సదరం సర్టిఫికెట్ 3ఆదాయ ధ్రువీకరణ పత్రము /రేషన్ కార్డు 4. ఆధార్ కార్డు కాపీలు 5.అంధులైన బాలలు చదువుతున్నటువంటి పాఠశాల లేదా కళాశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకొని రావాలి. ఈ సదవకాశాన్నిజిల్లాలోని అందరు దివ్యాంగులు వినియోగించేందుకు , ఇట్టి సమాచారం అందరికి చేరేలా అధికారులందరూ గ్రామాలలో టామ్ టామ్ ద్వారా చాటింపు చేయించి ఎక్కువ అవగాహన కల్పించడానికికృషిచేయాగలరు. వివరాల కోసం ఈ ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించగలరు . ప్రేమలత సీడీపీఓ :- 9908628891 గమనిక:- ఈ శిబిరం ద్వారా అర్హులైన దివ్యాంగులను గుర్తించడం జరుగుతుందని, గుర్తించిన అర్హులకు మరొక శిబిరం ద్వారా ముందుగా తెలియజేసి, సహాయ ఉపకరణాల పంపిణి కార్యక్రమంనిర్వహించబడుతుందని తెలిపారు

## బిర్యానీ సెంటర్ లపై మరియు రెస్టారెంట్లపై

### మున్సిపల్ అధికారులు ఆక స్మికంగా తనిఖీలు 4000 జరిమానా విధించారు.





మెట్ పల్లి**(గౌతమ్ న్యూస్):** మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ఆదేశాలతో పట్టణంలో ఉన్న బిర్యానీ సెంటర్ లపై మరియు రెస్టారెంట్లపై దాడులు నిర్వహించి నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని జరిమానా 4000 విధించడం అయినది కమిషనర్ మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న బిర్యానీ సెంటర్లలో పరిశీలించి జరిమానా వేయడం జరిగిందని తెలిపినారు నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని తెలిపినారు ప్లాస్టిక్ కవర్ వాడవద్దని జ్యూట్ బ్యాగులు వాడాలని తెలిపినారు మినరల్ వాటర్ వాడాలని తెలిపినారు కిచెన్ రూమ్ పరిశుభ్రంగా ఉంచాలని తెలిపినారు అపరిశుభ్రంగా ఉన్నచో రోజువారి దాడులు నిర్వహించి జరిమానా విధించబడునని తెలిపినారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ నిజాం అశోక్ పాల్గొన్నారు



## నాలుగో జాతీయ స్థాయి కరాటే,కుంగ్ ఫు టైక్వాండో పోటీలో గెలుపొందిన క్రీడాకారులను

### అభినందించిన డి.ఎస్.పి ఎస్.కె రెహమాన్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం టైక్వాండో క్రీడాకారులను కొత్తగూడెం డిఎస్పి ఎస్.కె రెహమాన్ తన కార్యాలయంలో అభినందించారు. ఈనెల 19,20వ తేదీలో తెలంగాణ రాష్ట్రం నాల్గవ జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫు, టైక్వాండో క్రీడ పోటీలు భువనగిరి వేదికగా నిర్వహించారు.తెలంగాణ టైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇనిగల మొగిలి ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారులు మూడు స్వర్ణ పథకాలు, మూడు వెండి పతాకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి గారు క్రీడాకారులను ఉద్దేశించి క్రీడలతో మానసిక ఉల్లాసం నిత్య ఆరోగ్యంగా ఉండడానికి తోడ్పడుతుందని యువకులు చిన్నారులు క్రీడల లో మరియు చదువులలో కూడా రాణించాలని దేశాన్ని గర్వించదగిన పౌరులుగా తయారు కావాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు స్వర్ణ పథకాలు కైవసం చేసుకున్న క్రీడాకారులు నిట్ట ప్రణయ్ కుమార్, అవినాష్, జయదీప్ వెండి పతాకాలు గెలుపొందిన వారు చరణ్,డానియల్,గౌతమ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టైక్వాండో అధ్యక్షుడు నిట్ట ప్రసాద్, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ పి.కాశి హుస్సేన్ పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మొక్కను నాటిన

### ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు మొక్కల రాజశేఖర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : ప్రకృతి హరిత దీక్షలో భాగంగా శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మెగాస్టార్ చిరంజీవి 69వ పుట్టినరోజునీ పురస్కరించుకొని మొక్కను నాటి శు భాకాంక్షలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డో నర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జే బి బాలు, హరికృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులు, ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు మొక్కల రాజశేఖర్ 2017 సంవత్సరం నుండి ప్రముఖుల పుట్టిన రోజులకి మొక్కలు నాటడం ప్రారంభించడం జరిగిందని తెలిపిన రాజశేఖర్. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జిల్లా అధ్యక్షుడు బరిగెల భూపేష్, సామర్ల సమ్మయ్య, అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ అంతా బోగస్!!

### పొంతన లేని ప్రభుత్వ ప్రకటనలు
### రుణమాఫీ లో కాంగ్రెస్ గారడి!!
### వనపర్తి ధర్నాలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు లక్షల రుణమాఫీ లో జరుగుతున్న మోసాలు, అన్యాయాలు, అక్రమాలను నిరసిస్తూ ఎలాంటి కండిషన్లు షరతులు, లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సమితి టిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో పొట్టి శ్రీరాములు చౌరస్తా దగ్గర టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి అనంతరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రుణమాఫీ విషయంపై ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా నిరసన తెలిపి వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 40% కూడా రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు మంత్రులు పూటకు ఒక మాట మాట్లాడుతూ పొంతనలేని మాటలు చెప్పి రుణమాఫీలో గందరగోళం సృష్టించడం వల్ల రాష్ట్ర రైతాంగం



ఆందోళనకు గురవుతుందని ఆయన ఆరోపించారు, ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డిసెంబర్ 9న ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పి ఇప్పుడు రోజుకు ఒక ప్రకటన చేస్తూ రైతులను తప్పుదో పట్టిస్తున్నాడని ఆరోపించారు, రుణమాఫీ కోసం 40 వేల కోట్లు నిధులు కావాలని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించి ఆ తర్వాత 31 వేల కోట్లకు ఆ తర్వాత 26 వేల కోట్లకు ఆ తర్వాత కేవలం 18 వేల కోట్లు మాత్రమే నిధులను రుణమాఫీ కింద రైతుల అకౌంట్లో జమ చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం చూస్తే ముఖ్యమంత్రి ఏ విధంగా మాట్లాడుతున్నాడో రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు, చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా ఈ ముఖ్యమంత్రి ప్రవర్తిస్తున్న తీరుకు రాష్ట్ర మంత్రులు కూడా పూటకు ఒక మాట మాట్లాడుతున్నారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు, ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం 40,000 కోట్ల రూపాయలు రుణమాఫీకి ఖర్చు పెట్టాలని కేవలం 18 వేల కోట్లు ఖర్చు చేసి 40 శాతం మందికి రైతులకు కూడా రుణమాఫీ కాలేదని సంపూర్ణంగా రుణమాఫీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకోవడం తగదని అన్నారు, ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం రుణమాఫీలో ఆంక్షలు ,షరతులు, కండిషన్లు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు, రెండు లక్షల రూపాయల పైబడిన రైతులు మిగతా డబ్బు బ్యాంకులో చెల్లించాలని ఆ తర్వాత రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం డిమాండ్ చేయడం కండిషన్ పెట్టడం పట్ల రాష్ట్ర రైతాంగం దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని, ఆయన ఆవేదన చేశారు, రైతుల పక్షాన టిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండదండగా ఉంటుందని రుణమాఫీ సంపూర్ణంగా జరిగే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వెంటనే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీని అర్హులైన ఈ రాష్ట్రంలోని ప్రతి రైతుకు మాఫీ చేయాలని లేని పక్షంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు, రుణమాఫీ తో పాటు రైతు భరోసా కింద ఎకరాలు 7500 రూపాయలను వెంటనే చెల్లించాలని చనిపోయిన రైతు కుటుంబాలకు 5 లక్షల పరిహారం ఎన్నికల ముందు ఇచ్చిన 6



గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని రెండు లక్షల రూపాయల రుణమాఫీ అందరికి సంపూర్ణంగా చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్సర్ రమేష్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ బి, లక్ష్మయ్య టిఆర్ఎస్ పార్టీ నాయకులు వాకిటి శ్రీధర్, సోషల్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్. రాజపేట పిఏసిఎస్ సొసైటీ అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నాయకులు మాణిక్యం, ధర్మానాయక్, కస్నా నాయక్, గంధం పరంజ్యోతి, గంధం విజయ్ కుమార్, బాలయ్య, శ్రీ మేధా టెక్నో స్కూల్ కరస్పాండెంట్ పలస శ్రీనివాస్ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు భారీ ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,

## ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి పి డి ఎస్ యు




టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** గత కొన్ని ఏళ్లుగా టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొని ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పి డి ఎస్ యు ) ఆధ్వర్యంలో కళాశాల వద్ద నిరసన తెలపడం జరిగింది ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా కోశాధికారి జె గణేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక సమస్యలు నెలకొని ఉన్న పట్టించుకునే వారే కరువయ్యారని తరగతి గదుల్లో నేల కుంగి ఉండే సరికి విద్యార్థులు కూర్చోవడానికి అసౌకర్యంగా ఉందని లైట్లు, ఫ్యాన్లు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, మంచినీరు, మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆటస్థలమంతా గడ్డితో , పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉందని కళాశాలకు ప్రహరీ లేక రాత్రివేళ ఆకతాయిలకు అడ్డాగా మారిందని విద్యార్థులు సైకిల్ పెట్టుకోవడానికి స్టాండ్ కూడా లేదని కళాశాల ఆవరణలో ఒకపక్క ప్రాథమిక ఆసుపత్రి ఏర్పాటు చేయగా, మరోపక్క పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారని కళాశాల సమస్యలు పరిష్కరించడం లేదని తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, సాయి తేజ, సింధు, పల్లవి, చందు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## నాటుదాం ఒక చెట్టు - అమ్మ పేరు




టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా కోయగూడెం, మద్రాస్ తండా, గ్రామపంచాయతీ లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మునగ మొక్కల పెంపకం 7000 మునగ మొక్కలను 6గురు రైతుల ద్వారా మొక్కలను నాటించు కార్యక్రమాన్ని ప్రారంభిచినారు. కోయగూడెం లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ మరియు మద్రాస్ తండా లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి రవీంద్రా రావు మండల పంచాయతీ అధికారి లక్ష్మీ గణేష్ గాంధీ చే ప్రారంభించారు ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమ అధికారి( ఏ పీ ఓ ఈజీఎస్ ,) కాలింగి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ తిరుపతయ్య , పంచాయతీ కార్యదర్శి లు గోపాలకృష్ణ, వసంతరావు, నరేష్ లు, మరియు ఉపాధి హామీ పథకం టి.ఎ ఈశ్లవత్ భీముడు, ఎఫ్ .ఏ లఖన్ లు మరియు రైతులు పాల్గొన్నారు.



## పంజాబ్ గడ్డ లో ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పున ప్రతిష్ట మహోత్సవ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణం 8వ మున్సిపల్ వార్డు పంజాబ్ గడ్డలో ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పున ప్రతిష్ట మహోత్సవం రెండు రోజులుగా ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పోచమ్మ తల్లి విగ్రహం 1969 లో సూధనాల నరసయ్య, మోలంగూరి బానయ్య,పోషమాళ్ళు ,కొమ్ము సుబ్బయ్య, ఐలయ్య ,మోదుంపల్లి దుర్గయ్య,దడిపల్లి వెంకటి,తాటికాయల రాయలింగు, మొలంగూరి వెంకటి, కొమ్ము కొమరయ్య తదితరులు అప్పుడు ప్రతిష్టించగా,మరల తిరిగి ఇప్పుడు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పోచమ్మ తల్లి విగ్రహాన్ని పున ప్రతిష్టించి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు మోదంపల్లి దుర్గరాజం, కొయ్యడ వెంకన్న, బరిగెల స్వామి, తాండ్ర కిషోర్ బాబు, కడారి కొమరయ్య, కొయ్యడ రాజయ్య, మహిళ సమైక్య జిల్లా నాయకులు బరిగెల సంపూర్ణ, కొయ్యడ పుష్ప, తాండ్ర భాగ్యలక్ష్మి, పద్మ, లతా, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సామర్ల సమ్మయ్య, జిల్లా నాయకులు బరిగెల భూపేష్, కొత్తూరు మదనయ్య, ఆవునూరి సంజీవరావు, చాట్ల హనుమంతు,కూరగాయల శ్రీనివాస్ ,బొంకురి పోశం,ఇల్లందుల దుర్గయ్య, పోచయ్య,ఐ.శంకర్, ఓదెమ్మ, రాజు, గోడిసెల రాము లక్ష్మణ్, బి. రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన యుక్త కంపెనీ చైర్మన్ శ్రేయాస్ బర్మేచ!!




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు బాసు రేగడి లో ఉన్న సెంట్ క్లారెట్ స్కూల్ లో చదువుతున్న పేద విద్యార్థులకు సహాయం అందించాలని యుక్త కంపెనీ యాజమాన్యని బాసర గడి కాంగ్రెస్ పార్టీ నాయకులు మారేపల్లి సుధాకర్ కోరినట్లు తెలిపారు, అడిగిన వెంటనే స్పందించిన యుక్త కంపెనీ యాజమాన్యం 52 మంది విద్యార్థులకు 1,17,000/- వేల రూపాయలను స్కూల్ యాజమాన్యానికి పిల్లల చదువుల కొరకు అందచేయడం జరిగిందని మరేపల్లి సుధాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో యుక్త కంపెనీ చైర్మన్ శ్రేయాస్ బర్మెచ్చ, స్కూలు ప్రిన్సిపల్ బెన్ని ఫాదర్,కో ఆప్షన్స్ సభ్యులు చిన్నపరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సుధాకర్, పెంటారెడ్డి, రాయప్పరెడ్డి,మాచేర్ల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడు మండలంలోని గ్రామపంచాయతీలను సందర్శించిన

### జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జూలూరుపాడు మండలం లోని గ్రామపంచాయతీలను సందర్శించారు.ముందుగా చింతల్ తండ గ్రామపంచాయతీలో మునగ మొక్కను నాటారు.ప్లాంటేషన్ లో భాగంగా మునగ మొక్కలు పంట వేసిన రైతు ముఖ్య దేవాను అభినందించారు. అనంతరం బేతాళుపాడు గ్రామపంచాయతీ సందర్శించి ఇంకుడు గుంతల నిర్మాణం, అజోల్ల పెంపకం పరిశీలించిసంతృప్తి వ్యక్తం చేశారు.రేగళ్ల తండా గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాల భవనం పూర్తిస్థాయి రిపేరు చేయవలసి ఉన్నందున ప్రతి పాదనలు సిద్ధం చేయవలసిందిగా అధికారులు ఆదేశించారు. మాచినపేట తండా ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసి పాఠశాల పైకప్పు కురుస్తున్నందున రిపేరు చేయించుటకు తగిన ప్రతిపాదన సిద్ధం చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.మాచినపేట తండాలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం కొమ్ముగూడెం గ్రామంలోని పశువుల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి భవనం శిథిలవసలోనందున ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు కాగానే ప్రాతిపదికన ఆస్పత్రి భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జూలూరుపాడు ఎంపీడీవో, కొమ్ముగూడెం పశువైద్య ఉపకేంద్రం బానోత్ బద్దులాల్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు బిజెపి బీఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు

### జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్



గీసుకొండ**(గౌతమ్ న్యూస్):** రైతులకు ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీని స్వతంత్ర భారతదేశంలో మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది కొంతమేరకు డేటా ఆధార్ నెంబర్ లాంటివి తప్పులు ఉన్న రైతులవి మాత్రమే ఆగి ఉన్నవి వాటిని కూడా సవరించి తొందరలోనే అందరికీ ప్రతి రైతుకు రుణమాఫీని అమలు చేస్తామని ప్రభుత్వం మంత్రులు స్పష్టంగా క్లియర్గా చెప్పినారు చేస్తున్నారు ఇంత పెద్ద సంక్షేమ పథకాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ బిజెపి వాళ్లు తట్టుకోలేక జీర్ణించుకోలేక ధర్నాలు చేసుకుంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు వీరి మోసపూరిత మాటలు రైతులు ఎవరు నమ్మద్దని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి. ప్రభాకర్ అన్నారు బిఆర్ఎస్ కొందరికే నాలుగు దపాలుగా చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని మండిపడ్డారు రుణమాఫీ ఆధార్ సవరణ కోసం ప్రభుత్వం అవకాశం ఇచ్చింది పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల పాలు చేసింది చెప్పలేక ధర్నాలట కేంద్రంలోని బిజెపి రుణమాఫీ గురించి ఎప్పుడు మాట్లాడలేదు బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎక్కడ అమలు చేయలేదనీ ఉన్నారు ఇప్పటికైనా బిజెపి బీఆర్ఎస్ లు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు లేదా రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా కూడా మీకు ప్రజలు ఇవ్వబోరని అన్నారు మండిపడ్డారు.

# బిఆర్ఎస్ రైతు రణం



నల్లబెల్లి(గౌతమ్ న్యూస్): రుణమాఫీ పేరుతో లక్షలాది రైతులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు బి ఆర్ఎస్ పార్టీ ఎన్‌హెచ్ 365 హైవే పైన నేడు ధర్నా నిర్వహించింది ఈ కష్టకాలంలో అన్నదాతలకు అండగా ఉండి సంపూర్ణ రుణ మాఫీ కోసం వారి పక్షాన కొట్లాడాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు రుణం పేరుతో రాష్ట్రవ్యాప్త ధర్నాకులకు పిలుపునిచ్చిన సందర్భంగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సారంగపాణి ఆధ్వర్యంలో మండలంలోని శనిగరం క్రాస్ హైవేపై ధర్నా నిర్వహించి రోడ్డును దిగ్బంధించారు ధర్నాతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ తో పాటు ఆరు హామీల అమలు చేయాలని రైతులను మోసం చేసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడా లని ఆయన డిమాండ్ చేశారు ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క పథకం అమలు కాలేదు అన్నారు షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులు తులం బంగారం అందించలేదన్నారు ఆడబిడ్డల తల్లిదండ్రులు అప్పులు చేసి పెళ్లి చేసి నెలల తరబడి ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు విద్యా దీవెన పథకం నిరుపేద మహిళలకు పక్కా ఇల్లు మహాలక్ష్మి పథకం కింద రూ.2500 వితంతు పింఛన్ పెంపు జరగలేదన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి ,క్లస్టర్ ఇంచార్జ్ ఇంగ్లీ శివాజీ, గందె శ్రీనివాస్ గుప్తా ,గోనెల నరహరి, గుమ్మడి వేణు, మాజీ సర్పంచ్ నాన బోయినరాజారాం ,మామిళ్ల మోహన్ రెడ్డి ,తోపాట మండలంలోని పార్టీ ముఖ్య కార్యకర్తలు మండల అనుబంధ సంఘాల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ శుభకార్యాలకు హాజరై
# వధూవరులను ఆశీర్వదించిన
## చిలువేరు సమ్మయ్య గౌడ్



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): గురువారం కేసముద్రం మండలం కేసముద్రం పట్టణం లచ్చిరాం నాయక్ తండా కి చెందిన మాజీ ఎంపీటీసీ గూగులోత్ సునీత- వీరు నాయక్ (బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు) కూతురు మానస వివాహం పృథ్వీరాజ్ తో పి.ఎస్.ఆర్ కన్వెన్షన్ మహబూబాబాద్ లో జరగగా వారి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వధించారు. అదేవిధంగా కేసముద్రం పట్టణంలోని లక్ష్మీ సాయి గార్డెన్ లో చెట్టబోయిన శ్రీలత -యాకయ్య ల కూతురు రచన-రాజుల వివాహం జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకలకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వధించి నూతన వస్త్రాలు బహుకరించి వధూవరులు నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఊకంటి యాకుబ్ రెడ్డి, ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నర్సయ్య, చిలువేరు సాయి గౌడ్, గాజుల రవి, కొండేటి కళాధర్, పబ్బతి ప్రశాంత్ గౌడ్, సంగే కిరణ్, చిన్నాల కట్టయ్య, కొత్త మహేందర్ రెడ్డి, కుంచాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## 21, 20, 24 వార్డులలో ఇంటింటికి సిపిఐ
## కొనసాగుతున్న సిపిఐ వార్డుబాట ప్రజామాట కార్యక్రమం
### మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధిపై బీఆర్ఎస్ చైర్మన్, నాటి, నేటి వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు శ్వేత పత్రం విడుదల చేయాలి
### పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న ,మామిండ్ల సాంబలక్ష్మి , నాగేళ్లి యాకమ్మ



మానుకోట జిల్లా(గౌతమ్ న్యూస్): మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిపిఐ వార్డు బాట, ప్రజా మాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికి సిపిఐ శ్రేణులు 21 20 24 వార్డుల్లో ప్రజల దగ్గరికి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చింతకుంట్ల వెంకన్న మామిండ్ల సాంబలక్ష్మి,, నాగేళ్ళి యాకమ్మ లు మాట్లాడుతూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో టిఆర్ఎస్ మున్సిపాలిటీ పాలకవర్గం చైర్మన్ నాటి, నేటి వైస్ చైర్మన్ లు మరియు కౌన్సిలర్లు మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం నిధులు తీసుకోవచ్చారు శ్వేత పత్రం విడుదల చేయాలని, వార్డుల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నారని మిషన్ భగీరథ పైప్ లైన్ వేయలేదని నల్లాలు రావట్లేదని పారిశుద్ధ్యం సరిగా లేదని దోమలు పందులు కుక్కలు కోతులు స్వైర విహారం చేస్తున్నాయని, వీధిలైట్లు వెలగడం లేదని, కొత్త పెన్షన్లు వస్తలేవని, ఇంటి నెంబర్లు ఇస్తలేరని, పేరు మార్పిడి కావట్లేదని ఎక్కడికి వెళ్లినా ఇంటింటికి ఒక సమస్య ఉన్నదని ప్రజలు వాపోతున్నారని సిపిఐ నాయకులకు తెలుపుతున్నారని, టిఆర్ఎస్ ప్రభుత్వం నుండి టిఆర్ఎస్ మున్సిపాలిటీ పాలకవర్గం ఉండి చైర్మన్ నాటి నేటి వైస్ చైర్మన్ లు కౌన్సిలర్లు ఏం అభివృద్ధి చేశారని ప్రజలు వారిని నిలదీస్తున్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టిఆర్ఎస్ పాలకవర్గం నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని, మానుకోట అభివృద్ధిని గాలికి వదిలేసారని దుయ్యబట్టారు, మాటలు తప్ప అభివృద్ధి చేయలేదని, వార్డులలో సిసి డ్రైన్లు సిసి డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, శివారు కాలనీలు తండాలు వీలిన గ్రామాల్లో అభివృద్ధి అంటే ప్రజలకు తెలియకుండా టిఆర్ఎస్ పాలకులు చేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ పాలకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించి వార్డులను అభివృద్ధి చేయాలని విలీన గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేల్లి యాకమ్మ, ఎర్రోజు పద్మ, ఆలేటి మహేష్, డొనికెని రమేష్, పుల్లకండం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ప్రముఖ సంఘ సేవకులు
### తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తాలి



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట్ మండల కేంద్రంలోని బి ఆర్ ఎస్ కార్యకర్త కిచనోల్ల వినయ్ అనారోగ్యంతో మరణించడం జరిగింది ఆ కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖ సంఘ సేవకుడు తాజా మాజీ జెడ్పటీసీ పబ్బ మహేష్ గుప్తా అలాగే వారి సొంత నిధుల నుండి 10000 వేల రూపాయలు మరియు ఒక నెలకు సరి పడే నిత్యావసర సరుకులు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో చింతకింది భిక్షపతి కుంట లింగం కుంట రాజు కుంట మైసయ్య కిచనోల్ల పోచయ్య చింతకింది నర్సయ్య చింతకింది పోశం పెద్దకొల ప్రవీణ కిచనోల్ల వంశీ పెద్దకోల్ల ప్రశాంత్ పెద్దకోల్ల జగదీష్ పెద్దకోల్ల నర్సింలు పెద్దకోల్ల నవీన్ చింతకింది దశరథ్ కిచనోల్ల కిరణ్ కర్రే రవి చింతకింది చెందు తదితరులు పాల్గొన్నారు

# అందరికీ ఎలాంటి షర్తులు లేకుండా వ్యవసాయ రుణమాఫీ చేయాలి

### అప్పటిదాకా ప్రభుత్వం పైన పోరాటం ఆగదు
### బిఆర్ టియు జిల్లా అధ్యక్షులు శివ శంకర్ రావు, బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల కేంద్రంలో గురువారం నాడు హత్నూర తహసిల్దార్ ఆఫీస్ వద్ద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతన్నలు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ప్రయోజనం పొందకపోవటంతో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను అయోమయానికి, ఆందోళనకు గురి చేయటమేమిటనీ ప్రశ్నించారు. రైతు రుణమాఫీ జరగక ఆందోళన చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మరింత గందరగోళానికి గురి చేసిన విధంగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి కారణంగా లక్షలాది మంది రైతన్నలు రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని వెంటనే చేయాలని ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలో రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ 30 శాతం చేశారని, రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒక మాట,మంత్రులు మరో మాట చెప్తున్నారని విమర్శించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.లక్షలాది మంది రైతన్నలకు అండగా ఉండేందుకు హత్నూర మండల పక్షాన ప్రభుత్వం పైన ఒత్తిడి చేస్తాం,రైతన్నలకి ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అందే వరకు స్థానిక ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి తరఫున ప్రభుత్వం పైన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ రైతులకిచ్చిన రూ 2 లక్షల రుణమాఫీ చేయాలి.కేసీఆర్ పాలన లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాం. అమలు కానీ హామిలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.ప్రజలను భ్రమలో పెట్టి ఓట్లు వేయించుకుంది. రైతుల పట్ల రేవంత్ మొసలి కన్నీరు కారుస్తున్నారు,ఋుణ మాఫీ కానీ రైతులు రోడ్లు ఎక్కుతున్నారు.రుణమాఫీ ఎగ్గొట్టే ఆలోచనలో కాంగ్రెస్ సర్కార్ ఉంది.కేసీఆర్ రూ 17 వేల కోట్లు ఇస్తే ఒక లక్ష రుణమాఫీ అయింది, కేసీఆర్ రైతుల పక్షపాతి.రైతుల రుణమాఫీ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటిల అమలు కోసం బీఆర్ఎస్ ఉద్యమిస్తోంది. రైతు భీమా పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇంత వరకు రెన్యూవల్ చేయలేదు.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ తప్పిదాలను బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు వివరించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ టియు జిల్లా అధ్యక్షులు శివ శంకర్ రావు, మాజీ ఎంపిపి నరసింహులు, వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీలు పండుగ రవికుమార్, మాజీ సర్పంచులు మాయిని శ్రీకాంత్, వీరేశం గౌడ్, భాస్కర్ గౌడ్, సుధాకర్,మాజీ ఎంపీటీసీలు కుంట మీది వీరేశం, సురేష్ గౌడ్, కృష్ణ గౌడ్, అజ్జు, మేరాజ్, పిఏసిఎస్ డైరెక్టర్ లు గుండా రాములు, మల్లేశం, నీరుడి యాదగిరి, చెక్క రాజు మండల పార్టీ నాయకులు, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా తీర్చిదిద్దాలి

### పేదల కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి
### ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



వరంగల్(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దాలని అందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)- ఎంసిపిఐ(యు) కాశిబుగ్గ ఏరియా పార్టీ జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ అన్నెబోయిన ప్రేమలత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ దినదిన అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరం రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత విస్తరిస్తున్న నగరం అని గత ఎన్నికలు వచ్చిన హామీ ప్రకారం వరంగల్ నగరాన్ని రాష్ట్ర రెండవ రాజధానిగా ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం వరంగల్ నగర ప్రజలను మోసం చేసిందని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెట్టి కాలం గడిపిందని అలాంటి మోసపూరిత హామీలకు పాల్పడకుండా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఈ క్రమంలో నగరంలో నిలువ నీడ కోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని తలదాచుకుంటున్న ప్రతి పేదవాడికి ఇంటి స్థలం పట్టా ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయలను అందించాలని కోరారు. అలాగే పేదల కాలనీలు మురికి వాడల అభివృద్ధికి నిధులు కేటాయించి ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు లేకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు స్థానిక సమస్యలపై దృష్టి సారించి పర్యటనలు జరిపి ప్రభుత్వం యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని స్థానిక పోరాటాల నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎంసిపిఐ(యు) కాశిబుగ్గ ఏరియా కన్వీనర్ గా పరిమళ గోవర్ధన్ రాజు కాశిబుగ్గ ఏరియా ఎంసిపిఐ(యు) కన్వీనర్ గా పరిమళ గోవర్ధన్ రాజును నియమిస్తున్నట్లు పార్టీ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ తెలిపారు. పార్టీ నియమ నిబంధనలకు లోబడి ప్రజా సమస్యలపై దృష్టి సారించి పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ నగర నాయకులు ఐతం నాగేష్ స్థానిక నాయకులు అజయ్ పద్మ శిరీష దేవరాజు ప్రభాకర్ రాజేందర్ అజయ్ అనూష తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సన్నాసులను నమ్ముకొని రైతులు ఆగం కావద్దు: సీఎం




హైదరాబాద్(గౌతమ్ న్యూస్): రూ.2 లక్షల రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం 100 శాతం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సన్నాసుల మాటలు నమ్ముకొని రైతులు ఆగం కావద్దని సూచించారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క రైతుకి న్యాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాలతో కొందరికి మాత్రమే రుణాలు మాఫీ జరగలేదని, త్వరలోనే పూర్తిగా రుణాలు మాఫీ అవుతాయని పేర్కొన్నారు. ఏ ఒక్కరికి రుణం మాఫీ కాకపోయినా.. ఇక్కడ తాము ఉన్నామన్న విషయాన్ని మర్చిపోవద్దని కోరారు.

### కలెక్టర్ ఆఫీసుల్లో అధికారులు...

"ఏ రైతుకి రుణమాఫీ రాకపోయినా మేం ఉన్నాం. కలెక్టర్ ఆఫీసుల్లో కుర్చీ వేసి ఆఫీసర్లను కూర్చోబెట్టాం. రైతు విషయంలో కొందరు దొంగ దీక్షలు చేస్తున్నారు. రైతులకు రోడ్డెక్కాల్సిన బాధ ఏమొచ్చింది? సన్నాసులను నమ్ముకొని ఆగం కావద్దు. రైతుల సమస్యలు విననప్పుడు ధర్నాలు చేయాలి. మీ సమస్యలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తొందరపడొద్దని కర్షక సోదరులను కోరుతున్నాం. రైతుల సమస్యను ప్రభుత్వం వింటుంది. పదేళ్లు దోచుకున్న వాళ్లను, ఆరునెలల కింద బొంద పెట్టిన వారిని మళ్లీ గ్రామాల్లోకి ఎందుకు రానిస్తున్నారు. రుణమాఫీ హామీ అమలు చేయడంతో హరీశ్ తన పదవికి రాజీనామా చేయాల్సి వస్తుందని ఇవాళ కొత్త డ్రామా మొదలు పెట్టారు. డ్రామాలో భాగంగానే దేవాలయాల వద్ద నిరసనలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. వారిపట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. రుణమాఫీ చేయడంతో బీఆర్ఎస్ నేతలకు ఏం చేయాలో పాలుపోవట్లేదు. దీంతో అబద్ధాలకు తెరతీశారు. కేటీరామారావు రుణమాఫీ విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. వారు రూ.లక్ష రుణం మాఫీ చేయడానికే ఆపసోపాలు పడ్డారు. అప్పటికీ అందరికీ పూర్తి చేయలేదు. కానీ మేం ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణాలను మాఫీ చేశాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా
# చంటి ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నిక




సిద్ధిపేట(గౌతమ్ న్యూస్): సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ గురువారం చంటి ముదిరాజ్ కు నియామక పత్రాన్ని అందజేశారు.గతంలో ఇదే సంస్థలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజల్లో అవగాహన సదస్సులు పెడుతూ ప్రజలను, విద్యార్థులను చైతన్య పరుస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుండి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ కు మరియు జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్ కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికా రులపై చర్యలు తీసుకుంటుందన్నారు.సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు,నంగునూరు మండల అధ్యక్షులు అశోక్ యాదవ్,గుండెల రాయుడు,బోదాస్ జగన్, ఎం.డి మున్న,జి.భాను ప్రసాద్, వెంకటేష్ యాదవ్,నమిండ్ల హరీష్,పాల్గొన్నారు..

## వక్ఫ్ బిల్లుపై తేల్చేసిన జగన్-బీజేపీతో కయ్యానికి రెడీ..!



**అమరావతి,:** కేంద్ర చట్టం ద్వారా ఏర్పాటైన వక్ఫ్ బోర్డులో మార్పులు చేయడంతో పాటు వక్ఫ్ ఆస్తుల యాజమాన్య హక్కులు తేల్చే లక్ష్యంతో ఎన్డీయే సర్కార్ లోక్ సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు ఆదిలోనే చుక్కెదురైంది. ఈ బిల్లును విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో చేసేది లేక జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది. అయితే ఈ బిల్లును వ్యతిరేకించిన విపక్షాల్లో వైసీపీ కూడా ఉంది. ఇవాళ ముస్లిం పెద్దలతో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్ వక్ఫ్ బిల్లుపై తమ పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. ఇవాళ తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ముస్లిం నాయకులతో సమావేశమైన వైసీపీ అధినేత జగన్ వక్ఫ్ చట్టంతో పాటు ఇతర సమస్యలపైనా వారితో చర్చించారు. ముస్లిం మైనారిటీల సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రత్యేక దృష్టి పెట్టిందని వారికి జగన్ గుర్తుచేశారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశామని, ముస్లిం మైనారిటీలకు సంబంధించిన ప్రతి అంశంపై తమ పార్టీ తొలి నుంచి అండగా నిలిచిందని జగన్ తెలిపారు. వైసీపీ తప్పకుండా ముస్లింల వెంట నడుస్తుందని, వక్ఫ్ బిల్లుపై వారు ప్రస్తావిస్తున్న అన్ని అంశాలను తమ పార్టీ ఎంపీలు పార్లమెంటులో లేవనెత్తుతారని జగన్ హామీ ఇచ్చారు. పార్లమెంటు సంయుక్త కమిటీలో సభ్యుడిగా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకుని, మీ అన్ని అభ్యంతరాలను పార్లమెంటు దృష్టికి తీసుకెళ్తారని జగన్ ముస్లిం నేతలకు తెలిపారు. వక్ఫ్ భూముల్లో దాదాపు 70 శాతానికి పైగా కబ్జాలో ఉన్నాయని, కొత్తగా ప్రతిపాదించిన వక్ఫ్ చట్టంలో రూపొందించిన నిబంధనల ద్వారా తమ భూములు తమకు దక్కకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని జగన్ తో భేటీలో ముస్లిం నాయకులు తెలిపారు. కొత్త వక్ఫ్ బిల్లును మొత్తం వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందన్న వారు, ఆ బిల్లును వైసీపీ వ్యతిరేకించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించడం వల్లనే, కేంద్రం దాన్ని జేపీసీకి పంపిందని గుర్తు చేశారు.

## సీఎం చంద్రబాబుకు వాలంటీర్ల భారీ షాక్



**అమరావతి,:** ఏపీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎన్నో హామీలిచ్చాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేసే దిశగా ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్నికల హామీల్లో ప్రధానమైన అంశం.. వాలంటీర్లకు వేతనం పెంపు. ప్రస్తుతం ఇస్తున్న రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు ఆ హామీని అమలు చేయలేదు. ఇప్పటివరకు వారికిస్తున్న గౌరవ వేతనం రూ.5వేలు కూడా ఇవ్వలేదు. ప్రతినెలా పింఛన్లను వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ సిబ్బందితో ఇంటింటికీ అందజేస్తున్నారు.

ప్రభుత్వంతో తాడో పేడో

దీంతో ఇప్పటివరకు ఓపిక పట్టిన వాలంటీర్లు ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారంతా ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారు. తమ ఉద్యోగాలపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందా? అనే ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో తమకు వేతనం పెంచి ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈనెల 27వ తేదీన ఏపీ మంత్రివర్గ సమావేశం జరగబోతోంది. ఆ సమావేశంలో వాలంటీర్ల విషయంలో ఒక నిర్ణయానికి రావాలని డిమాండ్ చేస్తున్నారు.

వేతన బకాయిలు కూడా చెల్లించాలని

విజయవాడలో ఈనెల 31వ తేదీన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నారు. పెరిగిన వేతనం రూ.10వేలతోపాటు పెండింగ్ లో ఉన్న వేతన బకాయిలు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యవర్గ సమావేశంలో ఉద్యమానికి విధివిధానాలు రూపొందించి దానిప్రకారం ముందుకు వెళ్లాలనే యోచనలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాలంటీర్లను విజయవాడకు ఆహ్వానించి భారీ ర్యాలీ చేయాలనే యోచనలో ఉన్నారు. రాష్ట్ర కార్యవర్గ నాయకులు దీనిపై చర్చల్లో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్లకు రూ.5వేల గౌరవ వేతనం అందేది. వైసీపీ కోసం కొందరు వాలంటీర్లు ఎన్నికల సమయంలో రాజీనామాలు చేశారు. వారిని మినహాయించి మిగతావారిని తీసుకోవాలనే యోచనలో ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఉంది.

## జగన్ ప్రభుత్వంలో ఎంత అన్యాయం జరిగిందో తెలుసా



### గ్రానైట్ వ్యాపారంలో

**అమరావతి,:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గ్రానైట్ అక్రమాలపై విచారం జరిపించాలని ఆ జిల్లాకు చెందిన గ్రానైట్ వ్యాపారులు చంద్రబాబు ప్రభుత్వానికి మనవి చేస్తున్నారు. గతంలో చిత్తూరు జిల్లాలో చక్రం తిప్పిన ఓ పెద్దాయన ఇప్పుడు కూడా గ్రానైట్ వ్యాపారంలో జోక్యం చేసుకుంటున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నెంబర్ టూ గా వ్యవహరించిన ఓ మాజీ మంత్రి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గ్రానైట్ వ్యాపారం నుండి భారీ మొత్తంలో మామూళ్లు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గ్రానైట్ వ్యాపారాలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారని వెలుగు చూసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఓ పెద్దాయన ఆయన అనుచరులను రంగంలోకి దింపి భారీ తతంగమే జరిపారని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు క్వారీలు లీజులు మొత్తం పెద్దాయన అనుచరుల చేతికి వెళ్లాయని ఆరోపణలు ఉన్నాయి. జగన్ సర్కార్ నిర్ణయంతో క్వారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణలు ఉన్నాయి. పెద్దాయన అనుచరుడు రంగంలో దిగి ఆయన చెప్పిన ధరకే గ్రానైట్ విక్రయించాలని షరతులు పెట్టాడని ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో జీ 20 మెటీరియల్ వ్యవహారం బయటకు వచ్చింది. జీ 20 మెటీరియల్ చైనా, పోలాండ్, తైవాన్ కు ఎగుమతి కాకుండా పెద్దాయన అనుచరుడు అడ్డుకున్నారని, ఎదురు తిరిగిన గ్రానైట్, క్వారీ యజమానులను పెద్దాయన అనుచరులు బెదిరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో ఢిల్లీకి చెందిన ఒక సంస్థను రంగంలోకి దింపిన పెద్దాయన అనుచరుడు తరువాత లావాదేవీలు నిర్వహించారని ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీకి చెందిన సంస్థకి తాను చెప్పిన ధరకే జీ 20 మెటీరియల్ గ్రానైట్ విక్రయించాలని పెద్దాయన అనుచరుడు గ్రానైట్ క్వారీ యజమానులకు షరతులు పెట్టారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఇలా విదేశాలకు విక్రయిస్తున్న గ్రానైట్ లో 30 శాతం ముందుగా ఢిల్లీ చెందిన సంస్థకే విక్రయించాలని, ఆ తర్వాత మిగిలిన 70 శాతం విదేశీ కంపెనీలకు విక్రయించాలని పెద్దాయన అనుచరుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రానైట్ యజమానులకు షరతులు విధించారని ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని క్వారీ యజమానులు, గ్రానైట్ యజమానులు గతంలో వారికి జరిగిన అన్యాయాల గురించి ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెద్దల ముందు వారి గోడు వినిపించుకుంటున్నారు.

## షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి

### మాజీ ఎమ్మెల్యే హరిప్రియ.



బయ్యారం,**(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ పాల్గొని మాట్లాడుతూ..షరతులు లేకుండా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ఒకేసారి చేస్తామని నమ్మబలికిందని,ఇప్పుడు రైతులందరినీ మోసం చేసిందని హరిప్రియ ఆరోపించారు. రైతుభరోస,రైతు రుణమాఫీ పథకాలను అర్హులైన రైతులకు వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



బయ్యారం మండలంలో మొత్తం 11 వేలు పైచిలుకు రైతులు ఉంటే కేవలం 3 వేలు మందికి మాత్రమే రుణమాఫీ చేశారని అది కూడా లేనిపోని షరతులు పెట్టి ఖాతాలలో డబ్బులు జమ చేయడం లేదని అన్నారు.మిగిలిన 8 వేల మంది రైతులకు కూడా బేషరతుగా రుణ మాఫీ చేయాలని,అలాగే రైతు భరోసా సాయం అందించాలని కోరారు.అనంతరం బయ్యారం తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అందరికీ ఎలాంటి షర్తులు లేకుండా వ్యవసాయ రుణమాఫీ చేయాలి

### అప్పటిదాకా ప్రభుత్వం పైన పోరాటం ఆగదు

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

### నర్సాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు



నర్సాపూర్**(గౌతమ్ న్యూస్):** నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండల పిఎసిఎస్ కార్యాలయం వద్ద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా



కార్యక్రమం మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతన్నలు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ప్రయోజనం పొందకపోవటంతో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను ఆయోమయానికి, ఆందోళనకు గురి చేయటమేమిటనీ ప్రశ్నించారు. రైతు రుణమాఫీ జరగక ఆందోళన చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మరింత గందరగోళానికి గురి చేసిన విధంగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి కారణంగా లక్షలాది మంది రైతన్నలు రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని వెంటనే చేయాలని ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలో రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ 30 శాతం చేశారని, రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒక మాట,మంత్రులు మరో మాట చెప్తున్నారని విమర్శించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.లక్షలాది మంది రైతన్నలకు అండగా ఉండేందుకు హత్నూర మండల పక్షాన ప్రభుత్వం పైన ఒత్తిడి చేస్తాం,రైతన్నలకి ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అందే వరకు స్థానిక ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి తరపున ప్రభుత్వం పైన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ రైతులకిచ్చిన రూ 2 లక్షల రుణమాఫీ చేయాలి.కేసీఆర్ పాలన లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాం. అమలు కానీ హామిలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.ప్రజలను భ్రమలో పెట్టి ఓట్లు వేయించుకుంది. రైతుల పట్ల రేవంత్ మొసలి కన్నీరు కారుస్తున్నారు,ఋణ మాఫీ కానీ రైతులు రోడ్లు ఎక్కుతున్నారు.రుణమాఫీ ఎగ్గొట్టే ఆలోచనలో కాంగ్రెస్ సర్కార్ ఉంది.కేసీఆర్ రూ 17 వేల కోట్లు ఇస్తే ఒక లక్ష రుణమాఫీ అయింది, కేసీఆర్ రైతుల పక్షపాతి.రైతుల రుణమాఫీ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటిల అమలు కోసం బీఆర్ఎస్ ఉద్యమిస్తోంది. రైతు భీమా పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇంత వరకు రెన్యూవల్ చేయలేదు.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ తప్పిదాలను బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు వివరించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, శివంపేట్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, శివంపేట్ తాజా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మెదక్ జిల్లా రైతు రక్షణ సమితి గౌరవ అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్, నర్సాపూర్ నియోజకవర్గంలోని ఎంపీటీసీ జడ్పిటిసి సర్పంచులు, మండల పార్టీ నాయకులు, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ కోసం ధర్నాలు

### ఏలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలి

### ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మాటలతో మాయచేసి అన్నదాతల ఆగ్రహాన్ని చల్లార్చడానికి మంత్రులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. బ్యాంకర్ల తప్పిదం, సాంకేతిక కారణాల వల్లే రుణమాఫీ జరగలేదంటూ మంత్రులు నెపాన్ని బ్యాంకుల మీదికి తోసివేసే ప్రయత్నం చేయడంతో రైతన్నలు బుధవారం బ్యాంకుల మీదకు దండెత్తారు. మాకెందుకు మాఫీ కాలేదంటూ జిల్లావ్యాప్తంగా బ్యాంకర్లను నిలదీశారు. దీంతో అనేక చోట్ల బ్యాంకులకు తాళాలు వేయడం లేదా పోలీసు భద్రతలో నడిపించడం కనిపించింది. మాఫీ మోసంపై గురువారం బీఆర్ఎస్ జిల్లావ్యాప్తంగా, మండల కేంద్రాల్లో ధర్నాలకు పిలుపునిచ్చింది. దీంతో ప్రభుత్వం పోలీసుల ద్వారా కార్యక్రమాన్ని అడ్డుకునే పనిలో పడింది. బీఆర్ఎస్ ధర్నాలకు ప్రభుత్వ అనుమతి లేదని వాటికి వెళ్లొద్దంటూ, వెళ్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మానుకోట తదితర అనేక నియోజకవర్గలలో పోలీసులు రైతులకు హెచ్చరించారు. రూ.2లక్షల రుణమాఫీ అమలు అస్తవ్యస్తంగా మారింది. సగం మందికి మాఫీ అయ్యి, మరో సగం మందికి కాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రుణమాఫీ కోసం వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకులకు వెళ్తే అధికారులను కలువమని, అధికారులను కలిస్తే బ్యాంకులకు వెళ్లమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. బ్యాంకర్ల తప్పిదాల వల్లే కొందరికి మాఫీ కాలేదంటూ మంత్రులు పదేపదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బ్యాంకులకు క్యూకట్టారు. తమ రుణమాఫీ ఎందుకు కావట్లేదని సిబ్బందిని నిలదీశారు. పలు చోట్ల ధర్నాలు చేశారు. విధులను అడ్డుకున్నారు. తమకు ఆధార్కార్డ్, రేషన్ కార్డు, పట్టా పాస్బుక్ ఉన్నప్పటికీ రుణంమాఫీ కాకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం నినదించారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా రేవంత్ షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కురవి మండలం నల్లెల్ల గ్రామం అజ్మీర హిరానీ భర్త కిషన్ వారికి లక్ష అరవై రూపాయలు తీసుకుంటే రుణమాఫీ కాలేదు. ఇంతకుముందు టిఆర్ఎస్ ప్రభుత్వం సక్రమంగా రుణమాఫీ చేసింది. కానీ ఈ ప్రభుత్వనికి ఏం పుట్టిందో అర్థం కావట్లేదు. ఎవరిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. బ్యాంకు సిబ్బంది రైతుల పేర్లు రుణమాఫీకి పంపడంలో నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారుల విధులను అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట బ్యాంకు వద్దకు వివిధ గ్రామాలకు చెందిన రైతులు భారీగా తరలివచ్చారు. తమ రుణమాఫీ చేయాలని అధికారులను నిలదీశారు. మహబూ బాబాద్ జిల్లాలోని కేసముద్రం గ్రామం రైతు పేరు కొల్లూరి శ్రీను. రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణాన్ని చెల్లిస్తే మాఫీ అవుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పడంతో పైనున్న రూ. 48 వేలను బ్యాంకులో చెల్లించాడు. ఆ తర్వాత మేనేజర్‌ను అడిగితే ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని చెప్పడంతో విస్తుపోయాడు. వ్యవసాయశాఖ అధికారిని అడిగితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదని చెప్పడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకాన్ని సమగ్రవంతంగా అమలు చేయాలని ఇప్పటివరకు 20 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ వర్తించలేదని అర్హులైన లబ్ధిదారులందరికీ రుణమాఫీ పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులందరికీ బేషరతుగా రెండు లక్షల రూపాయలు రుణమాఫీ జరగాలని బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత ఆధ్వర్యంలో గురువారం రైతు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరైన్నారు. తదనంతరం పై డిమాండ్లన్నీ కూడా సత్వరం పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు టిఆర్ఎస్ ప్రతినిధి బృందం వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా బి.ఆర్. ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది ఒకటి చేసేది ఒకటి, కలెక్టర్ 15 లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తానని మానుకోట గడ్డమీద ప్రమాణం భద్రాచలం సీతారాముల వారి మీద ప్రమాణం చేసి, మానుకోట జిల్లా రైతులను, తెలంగాణ రైతులను మోసం చేసి గద్దెనెక్కినావు. మీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయని కారణంగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గ మండల కేంద్రాలలో ధర్నాకు దిగిన రైతులు. కెసిఆర్ ప్రభుత్వంలో ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నం. ఒక ఉమ్మడి గ్రామపంచాయతీలో 1,000 వేయి మంది రైతుల ఉంటే 250 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. కానీ రేవంత్ రెడ్డి 100% రుణమాఫీ జరిగింది అని రైతులను నిర్మించి మోసం చేస్తున్నారు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మాజీ మార్కెట్ చైర్మన్ బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పరకాల శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు మార్నేని రఘు, తేల్ల శ్రీనివాస్ మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా, నునావత్ అశోక్, పిఎసిఎస్ చైర్మన్ నాయిని రంజిత్, యాళ్ల మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ముద్రలోన్ ఇప్పిస్తామని పెద్ద స్కామ్!



మల్లాపూర్ **(గౌతమ్ న్యూస్):** మల్లపూర్ మండల్ పాత దంరాజ్ పల్లి గ్రామము లో ఖానాపూర్ మండలానికి చెందిన ఒక మహిళ వివిధ బ్యాంకులలో లోన్ ఇప్పిస్తామని వచ్చి గ్రామంలోని ఒక మహిళతో పరిచయం ఏర్పరచుకొని ఆ మహిళతో స్నేహం చేస్తూ ఆ మహిళ ఇల్లును ఆఫీసుగా మార్చుకొని అమాయక మహిళలను ట్రాప్ చేస్తూ మీకు ముద్ర లోన్స్ వివిధ బ్యాంకులలో లోన్స్ ఇప్పిస్తానని వారికి మాయమాటలు తెలిపి వారి దగ్గర నుండి డబ్బులు సుమారుగా ఒక్కొక్కరి దగ్గర లక్ష రూపాయలు వసూలు చేసి మీకు లోన్ ఇప్పిస్తానని తెలుపుతు సుమారుగా రెండు సంవత్సరాల నుండి ఈ తతంగం అంతా దాంరాజుపల్లి కేంద్రంగా నడుస్తుంది దాంరాజు పల్లి లో ఉన్న సమాచారం మేరకు ఇప్పటికి మల్లపూర్ రాయికల్ మండలాల నుండి 70 నుండి 80 మందిని ఇలా ట్రాప్ చేశారని సుమారుగా 50 లక్షల మేర వసూలు చేశారని ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు డబ్బులు ఇచ్చిన వారు తిరిగి డబ్బులు ఇవ్వమని అడుగుతే వారిని బెదిరిస్తూ కాలయాపన చేస్తుంది మల్లాపూర్ మండలంలోని

ఒక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద ఇలాగే డబ్బులు వసూలు చేయగా అతను తిరిగి డబ్బులు అడగడంతో ఆమె దురుసుగా పవర్తించడంతో అతను ఆమెపైకి దాడికి ప్రయత్నించాడు దానిని ఆశరాగ చేసుకొని అతనిపై రేప్ కేసు పెట్టినట్టు సమాచారం అతను మరియు ఇతరులు కలిసి ఆ రేప్ కేసును ఉపసంహరింపచేసి వారికి డబ్బులు ఇచ్చే విధంగా మాట్లాడినట్టుగా సమాచారం అలాగే కొంతమంది ఆమెపై ఫిర్యాదు ఇచ్చి చట్టరీత్యా చర్యలు తీసుకుని వారిని జైలుకు పంపే విధంగా కేసు పెట్టడానికి ముందుకు వస్తున్నారు మీరు కనుక నాపై కేసు పెడితే మీ డబ్బులు ఇవ్వను ఏమీ ఇవ్వను నాకు న దగ్గర అన్ని ఉన్నాయి నాకు పోలీస్ లు తెలుసు విలేకరులు తెలుసు మీరు ఏమి చేసుకుంటారో చేసుకోండి అని వారిని బెదిరిస్తున్నట్టు వారిని బ్లాక్మెయిల్ చేస్తున్నట్టు వారు తెలుపుతున్నాను కేసు పెడితే మా డబ్బులు రావేమో అని భయంతో వారు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడం లేదు దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులు సుమోటోగా స్వీకరించి మోసాలను పసిగట్టి వారిని విచారించి బాధితులకు న్యాయం చేయాలని బాధితులు గ్రామ ప్రజలు కోరుతున్నారు

### జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో బీజేపీకి బిగ్ షాక్

# ఇండియా కూటమి కీలక అడుగు..!



న్యూఢిల్లీ: కీలకమైన జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి షాకిచ్చేందుకు ఇండియా కూటమి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే అతి త్వరలో వీరిద్దరి మధ్య పొత్తు ప్రకటన రావొచ్చని తెలుస్తోంది. అలా కుదరకపోతే ఎన్నికల్లో విడిగా పోటీ చేసి ఆ తర్వాత కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఇరు పార్టీలు భావిస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య సీట్ల చర్చలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న మూడు దశల్లో ఇక్కడ జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా పొత్తు కుదుర్చుకుని సత్తా చాటాలని ఇరు పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ కు స్వయంప్రతిపత్తి తొలగిస్తూ ఆర్టికల్ 360ని రద్దు చేసిన బీజేపీకి గట్టి గుణపాఠం చెప్పాలని భావిస్తున్న ఇరు పార్టీలు త్వరలో పొత్తుపై ఓ ప్రకటన చేయబోతున్నాయి.ప్రస్తుతం ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ నాయకులు శ్రీనగర్‌లో నిన్న అర్థరాత్రి సమావేశమై పొత్తుపై చర్చించారు. ఇందులో కాశ్మీర్ లోయలో 12 స్థానాల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్ తెలిపింది. అదే సమయంలో జమ్మూ డివిజన్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ కు 12 సీట్లను ఆఫర్ చేస్తోంది. అయితే సీట్ల పంపకంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. త్వరలో మరో దఫా చర్చలు ఉంటాయని, ఆ తర్వాత రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందని తెలుస్తోంది. ఈ పొత్తు ఖరారైతే జమ్మూ కాశ్మీర్ ఎన్నికల రూపురేఖలే మారిపోతాయనే అంచనాలున్నాయి.

## ఆ సమయంలో దాతలకు కేటాయించే గదుల రద్దు




**అమరావతి,:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం టీటీడీలోని వివిధ ట్రస్టులకు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కేటాయించే గదులను టీటీడీ రద్దు చేసింది. అక్టోబరు 4న ధ్వజారోహణం, అక్టోబర్ 12న చక్రస్నానం జరిగే రోజుల్లో మినహా మిగతా రోజులలో దాతలను దర్శనానికి అనుమతిస్తారు. కావున దాతలు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని కోరుతున్నారు. ఆగస్టు 27వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుండి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామివారిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తారు. శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామివారికి ఏకాంత తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేపడతారు. ఆగస్టు 28న తిరుమలలో ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి శ్రీ మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామివారు మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తారు. యువకులు ఎంతో ఉత్సాహంతో ఉట్లను కొడుతూ స్వామివార్లకు ఆనందాన్ని చేకూర్చుతారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 28న శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిసేవలైన ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

## ఇజ్రాయెల్ దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మృతి



గాజా : పాలస్తీనియన్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం గత కొన్నినెలలుగా దాడి చేస్తోంది. ఇప్పటికే చిన్నారులు, మహిళలతో సహా వేలాది మంది మృతి చెందారు. తాజాగా ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో మరో ముగ్గురు పాలస్తీనియన్లు మృతి చెందారని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. వెస్ట్ బ్యాంక్‌లోని తుల్కరేమ్ శరణార్థి శిబిరంలోని ఇంటిపై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడికి పాల్పడింది. గురువారం జరిగిన ఈ దాడిలో ఇంట్లో ఉన్న ముగ్గురు పాలస్తీనియన్లు మృతి చెందారు. ఇజ్రాయెల్ సైన్యం నివాసాలను, శిబిరాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తోంది. మౌలిక సదుపాయలను నాశనం చేయడానికి బుల్డోజర్లను పంపింది. శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడికి సంబంధించిన వీడియోను ఖుద్స్ న్యూస్ నెట్‌వర్క్ పోస్టు చేసింది. కాగా, తుల్కరేమ్‌లో జరిగిన ఈ వైమానిక దాడిలో కొంతమంది తీవ్రవాదులు చనిపోయారని, హమాస్ పాతిపెట్టిన పేలుడు పదార్థాల కోసం శోధన జరుగుతుందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఇజ్రాయెల్ దళాలు వెస్ట్ బ్యాంక్ నగరాలు, పట్టణాలలో దాడులు నిర్వహించాయని పాలస్తీనా వాఫా వార్త సంస్థ నివేదించింది. డీర్ బల్లూర్, టుబాస్ నగరాల్లోని ఇద్దరు యువకులను అరెస్టు చేసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఇద్దరు మహిళలు, ఒక చిన్నారితో సహా మొత్తం 25 మంది పాలస్తీనియన్లను వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దళాలు అరెస్టు చేసినట్లు వఫా తెలిపింది.

## రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు



**అమరావతి,:** పంచాయతీలకు పునరుజ్జీవం కల్పించేందుకు ప్రణాళిక ప్రకారం ముందడుగు వేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తాజాగా ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలను నిర్వహించి, గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజలంతా కలిసి తీర్మాణాలు చేయనున్నారని తెలియజేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా రూ.4,500 కోట్ల నిధులతో, 87 రకాల పనులను గ్రామాల్లో చేయనున్నామన్నారు. దీని ద్వారా మొత్తం 9 కోట్ల పనిదినాలు, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించే బృహత్తర ప్రణాళిక అమలు చేస్తామని పేర్కొన్నారు. సంస్కరణల్లో భాగంగా జాతీయ పండుగల నిర్వహణకు మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు నిధులను పెంచినట్టు తెలిపారు. పంచాయతీల ప్రత్యేకతను గుర్తించి ఆదాయం సృష్టిస్తామని తెలిపారు. విశాఖ జిల్లాలోని ఆనందపురం పువ్వులు, అరకు కాఫీకి ప్రత్యేకత అని తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే అలాగే అన్నింటిని గుర్తిస్తామన్నారు.

# నైపుణ్యాల వృద్ధి-నయా నగరం



విద్యతోపాటు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి అంశాన్ని అనేక దేశాలు గుర్తించి ఆ దిశగా చురుగ్గా అడుగులు వేస్తున్నాయి. ఉపాధి వలసలను ఇతోధికంగా ప్రోత్సహిస్తోన్న భారత్ కూడా కొన్ని చర్యలకు శ్రీకారం చుట్టింది. అయితే పురోగతి కొరవడింది. తెలుగు రాష్ట్రాలూ నైపుణ్యాల మెరుగుదలకు విశేష ప్రాధాన్యమిస్తున్నాయి. స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఒక ప్రత్యేక నగరాన్నే నెలకొల్పనున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సంతోషం, అభినందనీయం. మరి క్షేత్రస్థాయి పరిస్థితులు, అవకాశాల గురించి ఏమైనా అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు అసలు ప్రశ్న. అన్ని రకాల సాంకేతిక ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్న గల్ఫ్ దేశాలకు వృత్తి విద్య పట్టభద్రులు ఉపాధి కొరకు ప్రతి రోజు వందల సంఖ్యలో వస్తుంటారు. ఒక కఠోర వాస్తవమేమిటంటే ఇంజనీరింగ్ పట్టభద్రులు పలువురు తమ విద్యతో సంబంధం లేని ఇతర ఉద్యోగాలు చేసుకుంటున్నారు!. సాఫ్ట్‌వేర్‌ను మినహాయిస్తే మిగిలిన రంగాలలో మన యువత నైపుణ్యాలు అంతంత మాత్రమే. తెలుగు రాష్ట్రాలలో ఉబేర్, రాపిడో ఇత్యాది అద్దె రవాణా బైకులను నడిపే వారిలో అనేకులు ఇంజనీరింగ్ పట్టభద్రులే సుమా! దుబాయిలోని జబల్ అలీ మందిరం వెలుపల ఎండలో చిన్న చితక గిఫ్టు సామాన్లు లేదా సెంటు బాటిళ్ళ విక్రేతలలో కూడ కొందరు వారే ఉండడం ఒక లజ్జాకర పరిస్థితికి అద్దంపట్టడం లేదూ? ఇంజనీరింగ్ పట్టభద్రులు ఎంతో మంది చాలిచాలనీ వేతనాలతో నెట్టుకొస్తున్నారు. కారణమేమిటి? వారిలో వృత్తి నైపుణ్యాలు, భాషా కౌశలాలు కొరవడడమేనని చెప్పక తప్పదు. అరబ్ దేశాలలో ఫిలిప్పీన్స్, అమెరికాలో మెక్సికో జాతీయులకు ఉన్న సాంకేతిక నైపుణ్య పాటవాలు మన భారతీయుల వద్ద లేకపోవడం స్పష్టంగా కనపడుతుంది. తమ నైపుణ్యత ఆధారంగా అధిక వేతనంపై ఒక ఫిలిప్పీన్స్ జాతీయుడు తరచు ఉద్యోగం మారినట్లుగా ఒక భారతీయుడు మారడంలేదు, మారలేడు. సాఫ్ట్‌వేర్‌లో పూర్తిగాను, వైద్య రంగంలో పాక్షికంగాను ఉన్నత స్థానాలలో భారతీయులు రాణిస్తున్నారు, సందేహం లేదు. అయితే క్రింది, మధ్య శ్రేణులలో మాత్రం ఇతర దేశస్థులు, ప్రత్యేకించి ఫిలిప్పీన్స్ వారితో పోటీపడలేకపోతున్నారు. ఈ వాస్తవాన్ని భారత్ అధికార వర్గాలు కూడా గుర్తించాయి. పరిశ్రమలు, భారీ నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాలలో నిపుణులను గుర్తించే నీలం రంగు హెల్మట్‌లకు బదులుగా కార్మిక శ్రేణికి చిహ్నమైన పసుపు పచ్చ హెల్మట్లు ఎక్కువగా ఉండడం మన స్థాయికి తగినట్లుగా లేదు. ఇంజనీర్లు లేదా మేనేజ్‌మెంట్ ప్రతినిధులుగా పని చేస్తున్న అత్యధికులకు ఆంగ్ల భాషలో ఒక నివేదిక రూపొందించడానికి నానా ప్రయాసలు పడవల్సిన పరిస్థితి! సముద్రాల ఆవలి సీమలకు జరుగుతున్న వలసలను పక్కన పెడితే, దేశీయంగా కూడ అభివృద్ధికి అనుగుణంగా వృత్తి నిపుణులు లేకపోవడం ఎంతైనా శోచనీయం. అది అభివృద్ధికి విఘాతమవుతోంది. మహా నగరాలలో సైతం విభిన్న రంగాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా అందుబాటులో వృత్తి నిపుణులు లేరు. తెలుగునాట ఉన్నత స్థాయి నైపుణ్యత ఉన్నవారందరూ విదేశీబాట పడుతుండగా మధ్యతరగతి వృత్తులలో సైతం ఉత్తరాది రాష్ట్రాల యువత ముందుకు వస్తోంది. చివరకు కళాత్మక పనికి పెట్టింది పేరయిన ఒంగోలు తాపీ మేస్త్రీల స్థానంలో మధ్యప్రదేశ్ తాపీ మేస్త్రీలకు ఆదరణ లభిస్తోంది. అలాగే పొలాలలో వరి నాట్లు వేయడానికి బెంగాలీ కార్మికులు తెలుగునాటకు వస్తున్నారు. ఒక్క పట్టణంలో కూడ నైపుణ్యత కల్గిన ఒక ఎ.సి. టెక్నీషియన్ గానీ, మొబైల్ టెక్నీషియన్ గానీ లేకపోవడం గమనార్హం. సరైన అధ్యాపక వ్యవస్థ లేని విద్యా సంస్థలు ఏటా వేలాది సంఖ్యలో అరకొర చదువుతో యువతను వీధులలోకి వదులుతున్నాయి. అనుభవపూర్వకంగా నేర్చుకునే అవకాశాలు వారికి ఏ మాత్రం లేవు. అప్రెంటిస్‌షిప్ విధానం అంతరించిపోయింది. సాంకేతిక విద్యా రంగంలో ఏళ్ళ తరబడి భారీ సంఖ్యలో ప్రొఫెసర్లు, లెక్చరర్ల ఖాళీలు ఉన్నాయి. ఒకప్పుడు జాతి నిర్మాణంలో ఐటిఐలు, పాలీటెక్నిక్‌లు ముఖ్య భూమిక వహించాయి. వీటిలో చదివి చక్కెర కార్మగారాలలో పని చేసిన అనేక మంది ప్రపంచ అగ్రగామి పెట్రో రసాయనాల సంస్థలలో విజయవంతంగా పనిచేస్తున్నారు. మరి వారిని తీర్చిదిద్దిన ఆ పాలీటెక్నిక్‌లు ఇప్పుడు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. ఈ పరిస్థితులలో యువతలో తార్కిక శక్తిని, వృత్తిలో సృజనాత్మక దృక్పథాన్ని పెంపొందించడం ముఖ్యమని నరేంద్ర మోదీ ప్రభుత్వం గుర్తించింది. వికసిత్ భారత్‌లో నైపుణ్య సమృద్ధ యువత కీలకమని గత ఐదేళ్లుగా చెబుతున్నది. అయితే అందుకు తగినట్లుగా కార్యాచరణ ఉన్నదా? లేదు. జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం (నాట్స్)ను పునర్వ్యవస్థీకరించి ఇంజనీరింగ్, డిప్లొమా హోల్డర్లకు మెరుగైన నైపుణ్యతను సంతరింపచేసేందుకు పెద్దపీట వేస్తున్నామని చెప్పి, నైపుణ్యాభివృద్ధిలో పైలట్ ప్రాజెక్టు క్రింద యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన నౌకాశ్రయాల దిగ్గజ సంస్థ దుబాయి పోర్ట్ వరల్డ్ భాగస్వామ్యంతో వారణాసిలో నౌకాయాన, సరుకు రవాణాకు




సంబంధించిన శిక్షణా సంస్థను ఏర్పాటు చేసింది. సముద్ర తీరంలోని విశాఖ, కాకినాడ, చెన్నై, కొచ్చిన్‌లలో కాకుండా పూర్తిగా భూపరివేష్టిత వారణాసిలో అటువంటి సంస్థను ఏర్పాటు చేయడంలో ఔచిత్యమున్నదా? తెలుగు రాష్ట్రాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భాగస్వామ్యంతో పురోగమించడానికి ప్రయత్నించాలి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఏకంగా ఒక నగరాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఎంతో ఆనందం కలిగించింది. అదే సమయంలో అయోమయానికీ గురి చేసింది. యువత దశ, దిశ మార్చే ఈ బృహత్తర కార్యక్రమం స్వాగతించదగ్గదే కానీ దాని కొరకు సరైన అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు మనముందున్న అసలు ప్రశ్న.

# ఆకలి కేకలు తప్పవా

న్యూఢిల్లీ : దేశంలో ఆహార ధరలపై సరైన కోణంలో విశ్లేషణ జరగడం లేదు. ముఖ్యంగా ఆహార భద్రత కోణం నుంచి ఈ సమస్యను పరిశీలించాలని పలువురు నిపుణులు సూచించారు. ఆహారం సరిగా లభించక పోవడం వల్లనే కరువు కాటకాలు సంభవించడం లేదని, సామాజిక, ఆర్థిక అంశాలు కూడా దానికి దోహద పడుతున్నాయని చాలా ఏండ్ల క్రితమే ఆర్థికవేత్త అమర్త్యసేన్ తెలిపారు. ఈ సిద్ధాంతం నేటికీ చెల్లుబాటు అవుతుంది. రాబోయే కాలంలో పౌష్టికాహార లోపం కుటుంబాల ఆర్థిక వనరులపై ప్రభావం చూపబోతోంది. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా భవిష్యత్తులో ఆహార భద్రతకు అనేక సవాళ్లు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరించారు. నేడు దేశంలో పోషకాహార లోపం తలెత్తడానికి హరిత విప్లవ వైరుధ్యాలలో ఒకటి పాక్షికంగా కారణం అవుతోంది. హరిత విప్లవం కారణంగా బియ్యం, గోధుమలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా 1950-2007 మధ్యకాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా 2.5 శాతం చొప్పున పెరగ్గా అదే సమయంలో జనాభా 2.1 శాతం చొప్పున వృద్ధి చెందింది. ఫలితంగా మన దేశం బియ్యం, గోధుమలను ఎగుమతి చేయడం ప్రారంభించింది. అయితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు కేవలం ఆహార ధాన్యాలను మాత్రమే అందిస్తున్నారు తప్పించి అవసరమైన పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు సరఫరా చేయడం లేదు. ఫలితంగా ప్రజల్లో పోషకాహార లోపం ఏర్పడింది.

### అందుబాటులో లేని ఆరోగ్యకరమైన ఆహారం

ఆహార భద్రత, పోషకాహారంపై 2011లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ఓ పరిశీలన ప్రారంభించింది. భారతదేశంలోని జనాభాలో 74.1 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందడం లేదని అది తేల్చింది. గతేడాది విడుదలైన ప్రపంచ ఆకలి సూచికలో భారత్ 111వ స్థానంలో (మొత్తం 125 దేశాల్లో) నిలిచింది. ఈ సూచికలో ప్రతి ఏటా మన ర్యాంకింగ్ పడిపోతూనే ఉంది. 2016లో 97, 2017లో 100, 2018లో 103, 2022లో 107 ఇలా మన ర్యాంక్ పతనమవుతూనే ఉంది. హైతీ, సబ్-సహారా ఆఫ్రికాలోని 12 దేశాలు మాత్రమే మన కంటే తక్కువ ర్యాంకులో ఉన్నాయి. దేశంలో ఐదేండ్ల కంటే తక్కువ వయసున్న ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరు తక్కువ బరువును, 36 శాతం మంది తక్కువ ఎత్తును కలిగి ఉన్నారని 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలిపింది. వయసుకు తగినట్టు బరువు, ఎత్తు లేకపోవడం పోషకాహార లోపానికి సూచికలు. 19 శాతం మంది పిల్లలైతే ఎత్తుకు తగిన బరువు లేక పీలగా ఉన్నారు. ఇది కూడా పోషకాహార లోపం సూచికే. 2019-21లో దేశ జనాభాలో 36 శాతం మంది కుంగుబాటుకు లోనయ్యారు. 19 శాతం మంది అసాధారణ రీతిలో బలహీనంగా ఉన్నారు. 6-59 నెలల మధ్య వయసున్న పిల్లల్లో 67 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. పెద్ద వారిలో అంటే 15-49 ఏండ్ల మధ్య వయస్కుల్లో 57 శాతం మహిళలు రక్తహీనతకు గురయ్యారు.



### సౌకర్యాల కొరతతో వృథా

దేశంలో తృణధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ ఆహారధాన్యాల తలసరి లభ్యత తగ్గిపోతోంది. 1991లో ఒక్కో వ్యక్తికి రోజుకు 510.1 గ్రాముల ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండగా 2021లో 507.9 గ్రాములు మాత్రమే లభించాయి. వివిధ కారణాల వల్ల వ్యవసాయోత్పత్తుల్లో 40 శాతం వరకూ నష్టపోవాల్సి వస్తోంది. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు లేకపోవడంతో పండ్లు, పాలు వంటి 1.3 బిలియన్ టన్నుల సరుకులను నష్టపోవాల్సి వస్తోంది. అయినప్పటికీ వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో భారత్ గణనీయమైన వృద్ధే సాధిస్తోంది. వాటి అమ్మకాల ద్వారా 2021-22లో 50.2 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది.

### ఉత్పత్తిని దెబ్బతీసే వాతావరణ మార్పులు

ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ భవిష్యత్తులో వాటి లభ్యత ఎలా ఉంటుంది అనే విషయాన్ని పరిశీలిస్తే 2020-2050 మధ్యకాలంలో దేశ జనాభా 0.82 శాతం వార్షిక వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా. అంటే శతాబ్దం మధ్య నాటికి దేశ జనాభా 172,33,80,000కు చేరుతుంది. ఈ సమాచారం ఆధారంగా తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఆహార ధాన్యాలు, కూరగాయలు, పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి సగటున ఏటా వరుసగా 2,65 శాతం, 4.9 శాతం, 2.84 శాతం, 4.65 శాతం, 4.58 శాతం, 11.57 శాతం, 5.82 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. వాతావరణ మార్పులు సంభవిస్తే ఉత్పత్తిపై ప్రభావం పడవచ్చు. ఉదాహరణకు 2021లో 113 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి కాగా 2022లో 107 టన్నుల ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈ ఏడాది అది మరింత పడిపోయి 105 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. గతేడాదితో పాటు ఈ ఏడాది కూడా బియ్యం ఉత్పత్తి పడిపోయింది. అందుకే బాసుమతియేతర బియ్యం ఎగుమతులను కేంద్రం నిలిపివేసింది. ఫలితంగా దేశీయ మార్కెట్లో బియ్యం లభ్యత పెరిగింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల ఉత్పత్తి తగ్గిపోతే దాని ప్రభావం ఆకలిపై పడుతుంది. 2050 నాటికి ఆకలితో బాధపడే వారి సంఖ్య 11 నుంచి 20 శాతం వరకూ పెరగవచ్చునని ఓ నివేదిక తెలిపింది. దేశంలో 2022 నుండి తీవ్రమైన వడగాల్పులు సర్వసాధారణమై పోయాయి. వాతావరణ మార్పులే దీనికి కారణం. 1900-2018 మధ్యకాలంలో దేశంలో సగటు వార్షిక ఉష్ణోగ్రత 0.7 డిగ్రీలు పెరిగింది.

### ఉత్పత్తి పెంపు అనివార్యం

వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల కారణంగా విదేశీ కరెన్సీ బాగానే వస్తోంది. అయితే జనాభా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి పెరగకపోతే ఎగుమతులను తగ్గించుకోవడంతో పాటు నిత్యావసరాలను మరోసారి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ పరిణామం మన విదేశీ వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. మనం ఇప్పటికే పప్పులు, వంటనూనెలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నాము. దేశం నుంచి ఆహార ధాన్యాల ఎగుమతులు తగ్గితే అది ధరల పెరుగుదలకు దారితీస్తుంది. బియ్యం, గోధుమల ఎగుమతులపై విధించిన నిషేధం కారణంగా మోడీ ప్రభుత్వం అంతర్జాతీయంగా విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఓ అంచనా ప్రకారం జనాభా అవసరాలను తీర్చాలంటే 2030 నాటికి 311 టన్నులు, 2050 నాటికి 350 టన్నుల ఆహార ధాన్యాలను మన దేశం ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అందుకోసం ఉత్పాదకతనైనా పెంచాలి లేదా సాగు భూమినైనా పెంచాలని నిపుణులు సూచించారు.

### ఉన్న మాటంటే ఉలుకెక్కువ

తాజాగా ప్రకటించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలు ప్రభుత్వానికి అసంతృప్తిని కలిగించాయి. అది నివేదికను రూపొందించిన ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ డైరెక్టర్ సస్పెన్షన్కు దారి తీసింది. ఇకపై నివేదికల్లో రక్తహీనత అనే పదమే కనిపించకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2011-12, 2017-18 మధ్యకాలంలో దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న జనాభా శాతం పెరిగిందని జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం వెల్లడించింది. దీంతో ఆ నివేదిక ప్రచురణను ప్రభుత్వం నిలిపి వేసింది. గణాంక వివరాలు బహిర్గతం కావడానికి కారకులైన ఇద్దరు స్టాటిస్టిషియన్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు.

### అడుగంటుతున్న భూగర్భ జలాలు


వివిధ కారణాలతో దేశంలో 147 మిలియన్ హెక్టార్ల భూమి ఇప్పటికే సారాన్ని కోల్పోయింది. వాతావరణ మార్పులు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2050 నాటికి వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగం బీడుగా మారిపోయే ప్రమాదం ఉంది. అంతిమంగా అది ఉత్పాదకత తగ్గడానికి దారితీస్తుంది. భూమిలో లవణాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని, ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల క్రితం అంటే 2012-14లో వేసిన ఓ అంచనా ప్రకారం భూమిలో లవణాలు పేరుకు పోవడంతో అప్పటికే 16.84 మిలియన్ టన్నుల వ్యవసాయోత్పత్తులకు నష్టం చేకూరింది. పులి మీద పుట్రలా జల వనరుల లభ్యత కూడా తగ్గిపోతోంది. జనాభాతో పాటు నీటి వినియోగం కూడా పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. హరిత విప్లవ కాలం నుంచి నీటి వినియోగం అధికంగా ఉండే పంటలనే రైతులు పండిస్తున్నారు. దేశంలో లభ్యమవుతున్న భూగర్భ జలాలలో 89 శాతం వ్యవసాయానికే ఖర్చవుతున్నాయి. అందుకే 2007-2017 మధ్యకాలంలో భూగర్భ జల మట్టం 61 శాతం పడిపోయింది.

# జమ్మూకాశ్మీర్లో బీజేపీకి గడ్డు పరిస్థితే

నేషనల్ కాన్ఫరెన్స్దే హవాశ్రీనగర్ : పది సంవత్సరాల విరామం తర్వాత కేంద్రపాలిత ప్రాంత హోదాను కోల్పోయిన ఐదు సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జమ్మూకాశ్మీర్లో తొలిసారి వచ్చే నెలలో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. సెప్టెంబర్ 18తో ప్రారంభమయ్యే పోలింగ్ ప్రక్రియ మూడు దశలుగా సాగుతుంది. అక్టోబర్ 1వ తేదీతో ముగుస్తుంది. ఇప్పటికే అక్కడ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. జమ్మూకాశ్మీర్లో 2018 జూన్ నుండే ప్రభుత్వం లేదు. భద్రతా పరిస్థితులు దారుణంగా ఉన్న నేపథ్యంలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ)తో బీజేపీ సంబంధాలను తెంచుకుంది. అయితే ఇది వ్యూహాత్మకంగా తీసుకున్న నిర్ణయమే. 2019 లోక్సభ ఎన్నికలకు ముందు కాశ్మీర్లో శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని బీజేపీకి తెలుసు. 2018 డిసెంబరులో అక్కడ గవర్నర్ పాలన ముగిసింది. రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. ఈ పరిణామం ఆర్టికల్ 370 రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వానికి అందివచ్చిన అవకాశంగా భావించవచ్చు.

డీడీసీలపై విమర్శలు

ప్రత్యేక హోదా రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్ సుదీర్ఘ కాలం రాజకీయంగా సుప్తచేతనావస్థలో ఉండిపోయింది. 2020లో ప్రభుత్వం జిల్లా అభి వృద్ధి మండళ్లకు (డీడీసీలు) ఎన్నికలు నిర్వహిం చింది. ప్రజాస్వామ్య ప్రక్రియను క్రమేపీ పునరుద్ధ రించేందుకు తాను కట్టుబడి ఉన్నానని చెప్పుకు నేందుకే కేంద్రం ఈ ఎన్నికలు జరిపింది. అయితే




ఈ వ్యవస్థపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా డీడీసీలను ఏర్పాటు చేసి, ఎన్నికలు జరపడం ప్రజాస్వామ్య నిర్మాణానికి అర్థమా అని పలువురు ప్రశ్నించారు. సాధారణంగా సర్పంచ్లు జిల్లా అభివృద్ధి బోర్డులను ఎన్నుకోవడం దేశంలో సంప్రదాయంగా వస్తోంది. ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతి ద్వారా డీడీసీలను ఎన్నుకోవడంపై జమ్మూకాశ్మీర్ మాజీ ఆర్థిక మంత్రి హసీబ్ ద్రాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మండళ్లు రాష్ట్ర శాసనసభకు సమాంతర వ్యవస్థగా మారతాయని, ఈ చర్య శాసనసభను కించపరచడమే అవుతుందని ఆయన విమర్శించారు.

కాశ్మీర్లో అభ్యర్థులను నిలపని బీజేపీ

ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల్లో కాశ్మీర్ ప్రాంతంలో అభ్యర్థులను నిలిపేందుకు బీజేపీ వెనకాడింది. పునర్విభజనలో భాగంగా జమ్మూ లోని పిర్ పంజల్ ప్రాంతాన్ని కాశ్మీర్లో కలపడం దీనికి కారణం. కాగా దక్షిణ, మధ్య కాశ్మీర్లో నేషనల్ కాన్ఫరెన్స్ రెండు లోక్సభ స్థానాలను గెలుచుకుంది. ఉత్తర ప్రాంతంలో మిగిలిన ఏకైక స్థానంలో తిరుగుబాటు రాజకీయ నాయకుడు షేక్ అబ్దుల్ రషీద్ విజయం సాధించారు. ఉగ్రవాద ఆరోపణలపై ఆయన ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఈ పరిణామం బీజేపీకి ఇబ్బంది కరంగా, అవమానకరంగా మారింది. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ రషీద్ విజయాన్ని ఆకాశానికి ఎత్తేశాయి.

ఎన్సీదే హవా

జమ్మూ ప్రాంతంలో పహారీ భాష మాట్లాడే వారికి రిజర్వేషన్లు కల్పించడంతో అక్కడ బీజేపీకి మంచి ఫలితాలు దక్కాయి. జమ్మూలో కమలదళానికి ఓ కొత్త ఓటు బ్యాంక్ ఏర్పడింది. మొత్తంగా ఆర్టికల్ 370 రద్దుపై పెల్లుబికిన ప్రజాగ్రహం ఎన్నికల ఫలితాల్లో కన్పించింది. పిర్ పంజల్ ప్రాంతంలో సైన్యాన్ని దింపుతూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హింసను ప్రేరేపించి ఎన్నికలు వాయిదా పడేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపణలు వచ్చాయి. అక్టోబరులో జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారం లోకి వచ్చినప్పటికీ నేషనల్ కాన్ఫరెన్స్ కీలక పాత్ర పోషించడం తథ్యం. ఎందుకంటే ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల్లో ఆ పార్టీ 34 శాసనసభ స్థానాల్లో (మొత్తం స్థానాలు 90) ఆధిక్యత పొందింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటులో అది కీలక పాత్ర పోషిస్తుంది. జమ్మూకాశ్మీర్లో ప్రభుత్వం లేకపోవడంతో అధికారులదే రాజ్యంగా మారింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్ది గంటల ముందు పెద్ద ఎత్తున పోలీస్ అధికారుల బదిలీలు జరిగాయి. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ మండిపడింది. జమ్మూకాశ్మీర్లో కొత్తగా 90 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారు. దీంతో అక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 88.03లక్షలకుచేరింది.మహిళలుకూడాపెద్దసంఖ్యలోఓటర్లుగా చేరారు.

## ఇదేనా ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్ట్‌లకు రక్షణ



**హైదరాబాద్, :** రైతు రుణమాఫీ అసలు వాస్తవాలను ప్రజలకు చూపించేందుకు సీఎం సొంత ఊరు కొండారెడ్డిపల్లికి వెళ్లిన మహిళా జర్నలిస్టులు సరితా, విజయారెడ్డిపై సీఎం అనుచరులు దాడి చేయటాన్నిభారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్ట్ లపై దాడి చేయటం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఇందిరమ్మ పాలనగా ఫోజులు కొట్టే రేవంత్ రెడ్డి మీ పాలనలో మహిళా జర్నలిస్టులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. 'ఇద్దరు మహిళ జర్నలిస్ట్ లు ఏం తప్పు చేశారు. రేవంత్ రెడ్డి లెక్క అడ్డమైన బాష మాట్లాడారా ఆయన లెక్క బూతులు తిట్టారా' అని నిలదీశారు. కొండారెడ్డి పల్లెలలో రైతులకు రుణమాఫీ జరిగిందా అని తెలుసుకోవటానికి వెళితే కాంగ్రెస్ గుండాలు దాడి చేయటమేమిటనీ ప్రశ్నించారు. ఆడపిల్లలని కూడా చూడకుండా బురదలో నూకేసి, కొట్టి, అసభ్యంగా ప్రవర్తించి వాళ్లకు అవమానం చేయటం ఎంత హేయమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ వంద శాతం చేసింది నిజమైతే ఎందుకు భయం? ఎందుకు నువ్వు పుట్టిన ఇంటి ముందట ఇద్దరు ఆడబిడ్డలకు అవమానం చేశావని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళా జర్నలిస్టులపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలపైన వెంటనే కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ కూడా ఈ దాడిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోలాండ్ నుంచి ఇజ్రాయెల్, రష్యాకు ప్రధాని కీలక సలహా..



న్యూఢిల్లీ: రెండు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ మొదటగా పోలాండ్ లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో.. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి సమస్యనైనా యుద్ధభూమిలో కాకుండా సంభాషణలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఉక్రెయిన్ మరియు పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు మనందరికీ తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యుద్ధభూమిలో ఏ సమస్యకూ పరిష్కారం లభించదని భారత్ దృఢంగా విశ్వసిస్తోందని మోడీ చెప్పారు. మరోవైపు.. భారత్ తన స్నేహపూర్వక దేశాలతో చర్చలకు అన్ని విధాలా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని ప్రధాని మోడీ తెలిపారు. తాము చర్చలు, దౌత్యానికి మద్దతు ఇస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. ఉగ్రవాదంపై పోరు కూడా అవసరమని భావిస్తున్నాం.. ఇది ప్రపంచ సవాలు, దీని కోసం అందరూ కలిసి రావాలని మోడీ సూచించారు. పోలాండ్ తర్వాత ప్రధాని మోడీ ఉక్రెయిన్‌లో కూడా పర్యటించడం గమనార్హం. ఉక్రెయిన్ పర్యటనకు ముందు ప్రధాని మోడీ బుధవారం మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రాంతంలో శాంతికి భారతదేశం మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇది యుద్ధ యుగం కాదని.. ఏదైనా వివాదాన్ని దౌత్యం, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పునరుద్ఘాటించారు. పోలాండ్ రాజధానిలో భారతీయ కమ్యూనిటీ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. "దశాబ్దాలుగా భారతదేశం యొక్క విధానం అన్ని దేశాల నుండి దూరం పాటించడం. అయితే అన్ని దేశాలకు దగ్గరగా ఉండాలనేది నేటి భారత విధానం" అని పేర్కొన్నారు. నేటి భారతదేశం అందరితో కనెక్ట్ అవ్వాలని కోరుకుంటోందని మోడీ అన్నారు. నేటి భారతదేశం అందరి అభివృద్ధి గురించి మాట్లాడుతుంది.. నేటి భారతదేశం అందరితో ఉందని, ప్రతి ఒక్కరి ప్రయోజనాల గురించి ఆలోచిస్తుందని, ఏ దేశమైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటే ముందుగా ఆదుకునేది భారత్ అని మోడీ చెప్పారు. "ప్రపంచంలో ఎక్కడైనా భూకంపం లేదా ఏదైనా విపత్తు సంభవించినట్లయితే, భారతదేశానికి ఒకే ఒక మంత్రం %-% ముందు మానవత్వం" అని ఆయన అన్నారు. కాగా.. ప్రధాని మోడీ రేపు (ఆగస్ట్ 23న) ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడిన తర్వాత ఉక్రెయిన్‌లో పర్యటించనున్న తొలి భారత ప్రధాని మోడీనే. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ ఉక్రెయిన్‌లో పర్యటించనున్నారు. వివాదానికి శాంతియుత పరిష్కారంపై తన అభిప్రాయాలను ఉక్రెయిన్ అధినేతతో పంచుకుంటానని మోడీ చెప్పారు. మోడీ మాస్కో పర్యటనకు దాదాపు ఆరు వారాల తర్వాత కీవ్‌లో పర్యటించనున్నారు. అయితే.. మోడీ మాస్కో పర్యటనను అమెరికా, కొన్ని పాశ్చాత్య మిత్రదేశాలు విమర్శించాయి.

## సీఎం రేవంత్ రెడ్డి నిజస్వరూపం బయట పడింది..



**హైదరాబాద్, :** సీఎం రేవంత్ రెడ్డి నిజస్వరూపం బయట పడిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు గుప్పించారు. జనగామకు వచ్చి కొమురవెల్లి మల్లన్న మీద ఓట్టు వేసి ఆగస్టు 15 వరకు రైతులకు రుణమాఫీ చేస్తా అన్నాడని, ఏ ఊర్లోనైనా వంద శాతం రుణమాఫీ అయ్యిందా అని ఆయన ప్రశ్నించారు. ఇంకా 22 లక్షల మందికి రుణమాఫీ కాలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ మంత్రులే రుణమాఫీ మొత్తం కాలేదని ఒప్పుకున్నారని హరీష్ రావు గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కాపాడాలని యాదాద్రి నర్సింహ స్వామి ని వేడుకున్నా అని ఆయన అన్నారు. ఆగస్టు నెల వచ్చినా ఊర్లల్లో చెరువులు నింపడం లేదని ఆయన మండిపడ్డారు. రైతు భీమ, రైతు బంధు, చెరువులు నింపిన ఘనత కేసీఆర్ ది అని ఆయన వ్యాఖ్యానించారు. జాబ్ క్యాలెండర్ ఏమైంది. అని ఆయన ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఏవి. అని ఆయన అన్నారు. అసెంబ్లీలో చర్చకు ఎందుకు భయపడ్డవ్ రేవంత్ రెడ్డి అని, పోలీసులను హెచ్చరిస్తున్న, మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతం కాదని, చీఫ్ సెక్రటరీ మెడలు వంచైనా సరే ఋణమాఫి చేయిస్తామన్నారు హరీష్ రావు. మోసం రేవంత్ రెడ్డి ది, పాపం కాంగ్రెస్ పార్టీది న అని హరీష్ రావు మండిపడ్డారు.

## బ్యాంకులను రైతుల కోసం జాతీయం చేశారు ఇందిరాగాంధీ



**హైదరాబాద్, :**ఎడ్యుకేషన్, ఇరిగేషన్ మా ప్రయారిటీ అని నెహ్రూ పరిపాలన సాగించారని, బ్యాంకులను రైతుల కోసం జాతీయం చేశారు ఇందిరాగాంధీ అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పేదలకు భూములు ఇచ్చి ఆత్మగౌరవం పెంచారు ఇందిరాగాంధీ అని, సాంకేతిక రంగాన్ని పెంచి పోషించారు రాజీవ్ గాంధీ అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సాంకేతిక విప్లవం తెచ్చారు రాజీవ్ గాంధీ అని, పీవీ లాంటి ప్రధానులు దేశం కోసం ప్రణాళికలు రచించి దేశాన్ని ముందుకు నడిపించారన్నారు. స్వతంత్ర పోరాటం కోసం గుజరాత్ నుండి గాంధీ.. వల్లభాయ్ పటేల్ బయలుదేరారని, అదే గుజరాత్ నుండి.. మోడీ.. అమిత్ షా లు బయలు దేరారని, ఆ ఇద్దరినీ చూస్తే దేశం గర్విస్తుంది ఈ ఇద్దరు దేశం సంపద లూటీ చేస్తున్నారన్నారు రేవంత్ రెడ్డి. అంతేకాకుండా..'బీఆర్ఎస్ సన్నాసులు బీజేపీ నీ ఎందుకు నిలదీయడం లేదు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందో.. మలినం అవుతుందో వాళ్ళ ఇష్టం. కేసీఆర్ ఎందుకు బీజేపీ దోపిడీ మీద ఎందుకు స్పందించడం లేదు. ట్విట్టర్ టిల్లు ఎందుకు మాట్లాడరు. బీజేపీకి అనుకూలం కాబట్టే ఆయన స్పందించరు. జేసీసీ విషయంలో బీఆర్ఎస్ విధానం ఏంటి..? అమిత్ షా.. మోడీని మెప్పించడానికి రాజీవ్ గాంధీ విగ్రహం తీసేస్త అంటున్నారు. ఎయిర్ పోర్ట్ కి రాజీవ్ గాంధీ పేరు మారుస్తాం అంటున్నారు. చెయ్ వేసి చూడు.. వీపు పగలకొట్టక పోతే పేరు మార్చుకుంట. తెలంగాణ కి తల్లి సోనియా గాంధీ. సచివాలయం బయట కాదు.. లోపల తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం. పదేళ్లు ఈ సన్నాసులు ఎందుకు పెట్టలేదు తెలంగాణ తల్లి విగ్రహం. రైతుల ముసుగులో బీఆర్ఎస్ ధర్నా లు. ఏ రైతుకు మాఫీ కాకున్నా..కలక్టర్ కార్యాలయం లో కౌంటర్ పెట్టిన. 18 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశాం. కేటీఆర్ తప్పుడు మాటలు మానుకో మాది ప్రజా పాలన రైతులకు..ప్రజలకు అందుబాటులో ఉన్నాం. రోజూ మేము 18 గంటలు ప్రజల మధ్యనే ఉంటున్నాం. ధర్నా చేయాల్సిన అవసరం ఏముంది. ప్రజల్ని పట్టించుకోకుండా ఉన్నారు మీరు. కాకుల లెక్క.. గద్దల లెక్క పిక్కుతున్నది వీళ్లే కదా. కేటీఆర్..హరీష్ లాంటి సన్నాసులు కదా మిమ్మల్ని దోచుకుంది. వాళ్ళు మిమ్మల్ని మోసం చేయడానికి వస్తున్నారు. పదేళ్లలో మీరు ఎంత మాఫీ చేశారు.. మేము ఎంత చేశామో చర్చకు సిద్ధం. నెక్ట మా జగ్గన్న నే చూసుకుంటారు. సోషల్ మీడియా నీ నమ్ముకున్న మోడీ ఏమయ్యారు. మీరు అంతే ఐతరు 400 గెలుస్త అని మోడీ ప్రచారం చేసుకున్నారు..ఏమైంది. వచ్చే ఎన్నికల్లో 39 లో 9 కూడా రావు' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# రుణమాఫీ రాజకీయం



రాష్ట్రంలో రుణమాఫీ రాజకీయం నడుస్తున్నది. అధికార, ప్రతిపక్షాలు పరస్పర విమర్శలకు దిగి బెట్టుకు పోతున్నాయి. రుణమాఫీతో ప్రజల ఆధరాభిమానాలను చూరగొనాలని అధికార కాంగ్రెస్ భావిస్తుండగా, అందులోని లోటుపాట్లను ఎత్తిచూపే పేర బీఆర్ఎస్ నానాయాగి చేస్తుండటం గమనార్హం. రైతులను పంట రుణాల నుంచి విముక్తులను చేయడమే తమ లక్ష్యమని రేవంత్ సర్కారు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమేరకు రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ చేయడానికి సర్కారు ఓ మంచి ప్రయత్నమే చేసింది. దాదాపు 22 లక్షల మందికి రైతులకు రూ. 17,933 కోట్ల సొమ్ము వారి ఖాతాల్లో పడింది. వ్యవస్థలో లోపాల మూలంగా కొంతమంది రైతులకు రుణమాఫీ సొమ్ము చేరలేదు. కాగా రాష్ట్ర క్యాబినెట్ రూ.31 వేల కోట్లమేర రుణమాఫీ చేయడానికి గ్రీన్సిగల్ ఇచ్చింది. ప్రభుత్వం చెప్పిన దానికి చేస్తున్న దానికి పొంతన కుదరడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సీఎం ఒకలా, మంత్రులు మరోలా మాట్లాడటంతో గందరగోళానికి అవకాశం కలిగింది.గత బీఆర్ఎస్ సర్కారు సైతం రుణమాఫీని అమలుచేసింది. అప్పుడు కూడా సాంకేతిక లోపాలతో కొంతమందికి ఖాతాల్లో సొమ్ము పడలేదు. అవే ఇప్పటికీ కొనసాగడం ఆశ్చర్యం, విడ్డూరం. బ్యాంకులు ఆన్లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా మాఫీ మొత్తాలను జమచేస్తాయి. సొమ్ముపడటం లేదని కొందరు రోడ్డెక్కడాన్ని సర్కారు తీవ్రంగానే పరిగణించాలి. పరిష్కారాలను కనుగొనాలి. రుణమాఫీని సజావుగా పూర్తిచేయాలి. ఇందులో రాజకీయకోణాన్ని సర్కారు పట్టించు కోవాల్సిన అవసరం లేదు. ఎస్ఎల్బీసీ ప్రకారం 47 లక్షల మందికి రూ.49 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా, 22 లక్షల మందికే పరిమితం చేయడం న్యాయం అనిపించు కోదు. రుణమాఫీ అమలుకు వ్యవసాయ శాఖ గుర్తించిన 31 సాంకేతిక సమస్యలు ఆటంకమవుతున్నాయి. వాటిని వేగంగా పరిష్కరిస్తే విమర్శల నుంచి సర్కారు బయట పడేందుకు మార్గముంది. పథకం అమలు గురించి సలహాలు, సూచనలు చేయడం, స్వీకరించడం తప్పుకాదు. అలాగే పరస్పర భౌతికదాడులకు దిగడం మాత్రం సమర్ధనీయం కాదు. సిద్దిపేటలో చోటుచేసుకున్న రాజకీయ విన్యాసాలు శాంతిభద్రతలకు చేటుచేసేవే. తప్పుడు సంకేతాలు పంపేవే. సర్కారు చిత్తశుద్దిని శంకించాల్సిన పని లేదుకానీ, అదే సందర్భంలో ఆచరణే ప్రామాణికంగా గుర్తిం చాలి. ఇదిలావుండగా రూ.2 లక్షలకు పైబడిన అదనపు మొత్తాలను చెల్లిస్తేనే కొత్త పంట రుణాలిస్తామని బ్యాంకర్లు కొర్రీలు పెట్టడాన్ని చూస్తూ సర్కారు ఊరుకో కూడదు. దీనిపై ఎస్ఎల్బీసీపై ఒత్తిడి తేవాలి. అదనపు సొమ్ముతోపాటు ఎనిమిది నెలల వడ్డీని సైతం బ్యాంకులు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నమాట అక్షరసత్యం. బీఆర్ఎస్ పాలనలో చేసిన మాఫీ కాస్త వడ్డీలకే పోయిందని అప్పట్లోనే విమర్శలు వచ్చిన సంగతి మనం గుర్తుంచుకోవాలి. 2014-15లో 35 లక్షల మందికి రూ.16,140 కోట్లు మాఫీ చేస్తే అందులో రూ.9800 కోట్లు కేవలం వడ్డీ కిందే పోయాయి. 2018-23 వరకు రూ. 19 వేల కోట్లకుగాను రూ.12 వేల కోట్లు వడ్డీకే చెల్లింది. రెండు సందర్భాల్లో రైతులకు ఆశించిన ప్రయోజనం నెరవేరకపోగా, సర్కారిచ్చిన మొత్తంలో రూ.20 వేల కోట్లు వడ్డీ కిందకే బ్యాంకులు జమేసుకున్నాయి. మరో ఆశ్చర్యకరమైన సంగతి ఏంటంటే ఎస్ఎల్బీసీ ప్రకారం 72 లక్షల మంది రైతు లుంటే 42 లక్షల మందికే రుణాలిస్తున్నారు. 30లక్షల మందిని అసలు పట్టించు కోవడమేలేదు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి. అందరికీ రుణాలు అందేలా గట్టి చర్యలు చేపట్టాలి. బ్యాంకర్లు ప్రభుత్వానికి సరిగ్గా జాబితాలు పంపకపోవడం, అవకత వకలు, అవినీతి, నిబంధనల మేర రైతన్నలను ముప్పుతిప్పలు పెట్టే పరిస్థితిని క్షేత్ర స్థాయిలో సర్కారు సరిచేయాలి. పంటల రుణమాఫీ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతిపక్షం తొందరపడుతున్నాదని కాంగ్రెస్, శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుండం గమనార్హం. బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేనివి, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నెంబర్లల్లో తప్పులున్నవి, పాసుబుక్కు నంబర్లు లేనివి, బ్యాంకు ఖాతా, ఆధార్ పేరుతో సరిపోలనవి పెండింగ్లో ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఈ లోపాలను వ్యవసాయ శాఖ వేగంగా పరిష్కార కేంద్రాల ద్వారా సరిచేస్తేనే రుణమాఫీకి సార్ధకత. పరస్పర విమర్శలతో సమస్యను పక్కదారి పట్టిస్తే క్షమార్హం కాదు. మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలను రైతులకు త్వరగా ఇప్పించాల్సిన బాధ్యతా పాలకులదే.

# బిఆర్ఐపై మోడీ దాడి

ఈ నెల 17వ తేదీన జరిగిన దక్షిణాది దేశాల సదస్సులో వర్చువల్‌గా ప్రసంగించిన మోడీ చైనా అమలు చేస్తున్న 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బి.ఆర్.ఐ) కార్యక్రమంపై దాడి చేశారు. నిలకడ లేని ప్రాజెక్టులకు చైనా వేల కోట్ల రూపాయల రుణాలను ఇవ్వటం ద్వారా ఆసియా, ఆఫ్రికా దేశాలను అప్పులలో మునిగిపోయేలా చేస్తున్నదని విమర్శించారు. బి.ఆర్.ఐకి ప్రత్యామ్నాయంగా ఇతర దేశాలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయటానికంటూ 'గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్' (జి.డి.సి)ను మోడీ ప్రతిపాదించారు. ఇది పేద వర్ధమాన దేశాలు ప్రతిపాదించిన అభివృద్ధి నమూనాపై దృష్టి పెడుతుందని, అప్పులు చేస్తున్న దేశాలపై కూడా ఎలాంటి భారం మోపదని ఆయన చెప్పారు. జి.డి.సి లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా వాణిజ్యం అభివృద్ధి చెందుతుందని, సుస్థిరాభివృద్ధిని సాధించటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవటం జరుగుతుందని, ప్రాజెక్టులకు రాయితీ రుణాలు, గ్రాంట్లను పొందవచ్చునని ఆయన చెప్పారు. చైనా వేల కోట్ల డాలర్ల పెట్టుబడులతో బిఆర్ఐని అమలు చేస్తుండగా, ఎటువంటి పెట్టుబడులు, సన్నాహాలు లేకుండా జి.డి.సి ని ప్రతిపాదించటం ఊహాజనితం మాత్రమే. ఈ సందర్భంలో మోడీ చేసిన వ్యాఖ్యలు చైనా వ్యతిరేకతను పెంచటానికి దోహదం చేస్తాయి. బి.ఆర్.ఐ లో మొత్తం 152 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఆఫ్రికా ఖండంలోని 52, యూరప్, సెంట్రల్ ఆసియాలో 34, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో-చైనాతో కలిపి-25, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలు 22, మధ్యప్రాచ్యం, ఉత్తర అమెరికా లోని 19 దేశాలు, ఆసియా దక్షిణ, తూర్పు ప్రాంతంలోని 6 దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. వీటితో పాటు యూరోపియన్ యూనియన్ లోని 17 దేశాలు, జి 20లోని 8 దేశాలు, 30కి పైగా అంతర్జాతీయ సంస్థలు కూడా భాగస్వాములుగా ఉన్నాయంటేనే దీని ప్రాముఖ్యత ఏమిటో అర్థం అవుతుంది. ఇప్పటి వరకు ప్రపంచంలోని ఏ ఒక్క దేశం ఇంత భారీ పథకాన్ని రూపొందించి అమలు చేయటానికి పూనుకోలేదు. ఈ పథకంలో భాగస్వాములైన దేశాలలో సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన ప్రాజెక్టులను చైనా నిర్మిస్తున్నది. ఆ యా ప్రాజెక్టులను నిర్మించటం కోసం ఆ దేశాలకు ద్రవ్య రూపంలో కూడా సహకారాన్ని అందిస్తున్నది. ఈ పథకంలో భాగంగా నిర్మిస్తున్న వాటిలో రైల్వేల నుండి ఉపగ్రహాల వరకు ఉన్నాయి. ఇతర అనేక పథకాలతో పాటు జల విద్యుత్ ప్రాజెక్టులు, రవాణా, ఓడరేవులు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితర పథకాలను అమలు చేస్తున్నది. వివిధ దేశాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలను అమలు చేయటం వలన భాగస్వామ్య దేశాల మధ్య సరుకులు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం ఇచ్చి పుచ్చుకోవటం పెరిగింది. బి.ఆర్.ఐ అమలు తీరుపై 2019లో జరిగిన సమీక్షలో దానిలో సభ్యులుగా చేరిన దేశాలు పొందుతున్న ప్రయోజనాలను పేర్కొన్నారు. అప్పటికి




ఈ పథకాన్ని ప్రారంభించి ఆరు సంవత్సరాలు అవుతున్నది. ఈ పథకంలో భాగస్వాములైన దేశాలు ఉమ్మడి నిర్మాణాల వలన ప్రయోజనాలను పొందు తున్నాయని, ఆ ప్రాంతాలలో అభివృద్ధి వేగం పుంజుకున్నదని, ప్రపంచ స్థాయిలో సహకారం పెరగటానికి దోహదం చేసిందని స్పష్టం చేశారు. ఉదాహరణకు బి.ఆర్.ఐకి ముందు చైనా నుండి యూరప్ దేశాలకు సరుకులు పంపటానికి ఒంటెలపై నెలల తరబడి ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇపుడు నిర్మిస్తున్న హై స్పీడ్ రైలు మార్గాల ద్వారా ఒక్కరోజు లోనే సరుకులు చైనా నుండి యూరప్‌కు, యూరప్ నుండి చైనాకు చేర్చవచ్చు. ఫలితంగా సరుకులు త్వరగా చేరటం, వాణిజ్యం విస్తరించటమే కాక, సమాచార సంబంధాలు కూడా విస్తరిస్తాయి. నిబంధనలు, పన్నులు, మేధో సంపద హక్కులు, వివాద పరిష్కార పద్ధతులు తదితరాలపై బి.ఆర్.ఐ లో భాగస్వాములైన దేశాలతో చైనా ఒప్పందాలు చేసుకున్నది. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పెద్ద ముందడుగును సాధించారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్, అమెరికా ఖండాలలోని ప్రజలను సన్నిహితం చేయటంలో ఈ ప్రాజెక్టు ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నది. 2013-18 మధ్య కాలంలో చైనా, బి.ఆర్.ఐ దేశాల మధ్య ఆరు లక్షల కోట్ల డాలర్ల విలువైన సరుకుల వాణిజ్యం జరిగింది. ఈ కాలంలో చైనా 9,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. ఆ దేశాలలో 2.50 లక్షలకు పైగా నూతన ఉద్యోగాలు కల్పించబడ్డాయి. 15 యూరప్ దేశాలలోని 50 నగరాలను చైనాతో అనుసంధానం చేసి సరుకులను రవాణా చేసే రైళ్ళు 2019 నాటికే 14,000 ట్రిప్పులను పూర్తి చేశాయి. 2018 నాటికి గ్రీస్ లోని పైరియస్ ఓడరేవు కార్యకలాపాలు ఐదు రెట్లు పెరిగాయి. ఇపుడు ప్రపంచం లోని 100 అతి పెద్ద ఓడరేవులలో 36వ స్థానంలో ఉన్నది. 2019 తర్వాత గడిచిన ఐదు సంవత్సరాలలో ఈ కార్యకలాపాలు అనేక రెట్లు అదనంగా పెరిగాయన్నది స్పష్టమే.

### అమెరికా ఆధిపత్యానికి గండి కొడుతున్న చైనా


ప్రపంచ దేశాలపై పెత్తనం చేస్తూ, కోట్లాది మందిని దారిద్ర్యంలో ముంచే విధానాలను అనుసరించాలని ఆ యా దేశాలను ఒత్తిడి చేస్తూ, యుద్ధాలను ప్రోత్సహిస్తూ, యుద్ధాలలో ప్రత్యక్ష పాత్ర వహిస్తూ లక్షలాది మంది ప్రాణాలు తీస్తున్న అమెరికా ఆధిపత్యాన్ని అన్ని రంగాలలోనూ చైనా సవాలు చేస్తున్నది. ఆర్థికంగా ప్రపంచ దేశాలను ఆదుకోవటంతో పాటు రాజకీయ, సైనిక, దౌత్య రంగాలలో అమెరికా విసురుతున్న సవాళ్ళను తిప్పికొడుతున్నది. ప్రపంచంలో వివిధ దేశాలకు అవసరమైన సమయాలలో రుణాలు, సహాయాన్ని అందించే సంస్థలు కొద్ది సంఖ్యలో మాత్రమే ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు, చైనాకు చెందిన బి.ఆర్.ఐ, మరికొన్ని సంస్థలు ఉన్నాయి. వీటిలో బి.ఆర్.ఐ మినహా మిగిలిన సంస్థలు రుణాలు తీసుకొనే దేశాలపై కఠినమైన షరతులు పెట్టి, ఆంక్షలు విధించి, రుణాలు ఇస్తాయి. రుణాలు తీసుకున్న దేశాలు ఆ సంస్థలు విధించిన ఆంక్షలతో ప్రజలపై తీవ్రమైన భారాలను మోపాల్సి వస్తుంది. ప్రభుత్వ విధానాలు ప్రజల కొనుగోలు శక్తిని హరించి వేయటంతో కొద్ది కాలంలోనే ఆ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతాయి. ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న తూర్పు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు అనేకం సంక్షోభంలో కూరుకుపోయి, దివాళా తీయటాన్ని చూశాం. 1977 నుండి సరళీకరణ విధానాలను అనుసరించిన ఫలితంగా మన పొరుగు దేశమైన శ్రీలంక తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. ఆగ్రహించిన ప్రజలు లక్షలాదిగా ఆందోళనలలో పాల్గొనటంతో ఎన్నికైన ప్రభుత్వం పతనం అయింది. బెయిలవుట్ పేరుతో మరింత సంక్షోభంలోకి నెట్టే ఆంక్షలను విధించటంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. ఈ సంస్థల షరతులను అంగీకరించకుండా స్వతంత్రంగా వ్యవహరించిన దేశాలు సంక్షోభం నుండి త్వరగా కోలుకున్నాయి. ఆంక్షలను అంగీకరించిన దేశాలు మరింత సంక్షోభంలో చిక్కుకున్నాయి. శ్రీలంకపై విధించిన ఆంక్షలు ఆ దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి. దీనికి భిన్నంగా బి.ఆర్.ఐ ద్వారా చైనా అందిస్తున్న రుణాలకు కఠినమైన షరతులను విధించటం లేదు. రుణాలు తీసుకున్న దేశాలలో సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతున్నది. చైనా ప్రధాన భాగస్వామిగా ఉన్న బ్రిక్స్ బ్యాంక్ కూడా రుణాలు తీసుకున్న దేశాల ప్రజలపై భారాలు విధించే, ఆ దేశాలను దివాళా తీయించే షరతులను విధించటం లేదు. ఫలితంగా చైనా దగ్గర రుణాలు తీసుకుంటున్న దేశాలు స్వేచ్ఛగా తమ దేశాలను అభివృద్ధి చేసుకొనే అవకాశం లభించింది. పేద దేశాలు దివాళా తీయటానికి కారణమౌతున్న ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితరాల జోలికి పోకుండా బి.ఆర్.ఐ సరళంగా ఇస్తున్న రుణాలను మోడీ తెగనాడుతున్నారు. బి.ఆర్.ఐ ఇస్తున్న రుణాలు, ఈ సంస్థలు కఠినమైన షరతులతో ఇస్తున్న రుణాలకు ప్రత్యామ్నాయంగా ఉన్నాయి. దీన్ని మోడీ సహించలేక పోతున్నారు. ఈ ప్రత్యామ్నాయాన్ని పక్కన పెట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికా, సామ్రాజ్యవాద దేశాల ఉచ్చులో చిక్కుకోవాలని మోడీ భావిస్తున్నారు. ప్రపంచంలోని ప్రతి దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా అమెరికా, దాని ఆధ్వర్యంలోని అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఇటువంటి సమయంలో చైనా, చైనా ఆధ్వర్యంలోని సంస్థలు ఇస్తున్న రుణాలు, రాజకీయ సహకారాన్ని ప్రపంచ దేశాలు మరింత ఎక్కువగా వినియోగించుకోవాలి.

# "సేఫ్టీ ఆడిట్ గురించి చెబుతూనే ఉన్నా"
# అచ్యుతాపురం సెజ్ ప్రమాదంపై పవన్ కల్యాణ్

అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్'లో జరిగిన ప్రమాదంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. పరిశ్రమలలో సేఫ్టీ ఆడిటింగ్ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. అధికారంలోకి వచ్చినినాటి నుంచి పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ చేయమని చెబుతూనే ఉన్నానని ఆయన తెలిపారు. ఈవిషయంలో కంపెనీ యాజమాన్యాలు భయపడుతున్నాయని, వాళ్లకు వివరించాల్సిన అవసరం ఉందని పవన్ అభిప్రాయపడ్డారు. గురువారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ గురించి సెప్టెంబర్‌లో చర్చించాలనుకున్నాం. కానీ, ఈ నెల చివరలోనే ఈ విషయంపై కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతాను" అని పవన్ అన్నారు. సేఫ్టీ ఆడిటింగ్ జరిగితే పరిశ్రమలు మూతపడతాయోమోనని యజమానులు ఆందోళన చెందుతున్నారని, దీని గురించి వారిని ఎడ్యుకేట్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కనీస భద్రత కల్పించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. "ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కొనసాగుతున్న ఈ రసాయనిక కర్మాగారానికి ఇద్దరు యజమానులు ఉన్నారు. వీరి మధ్యన విభేదాలు ఉండటంతో సేఫ్టీ ఆడిట్ చేయించలేదు" అని పవన్ తెలిపారు.

### 'సేఫ్టీ ఆడిట్ జరగకపోవడమే కారణం'

"అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం దురదృష్టకరం. ఈ ప్రాంతంలోనే ఇటువంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని" అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. "బాధితులను కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. చాలా కాలంగా సేఫ్టీ ఆడిట్ జరగకపోవడమే ప్రమాదానికి కారణం. థర్డ్ పార్టీతో కూడా ఆడిట్ చేయించాలనుకున్నాం. గతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సెజ్ యాజమాన్యాలు, పారిశ్రామిక వేత్తలు, స్టీల్ ప్లాంట్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ సంస్థలతో సమావేశం నిర్వహించి ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై చర్చించారు. ఈ ప్రమాదంలో యాజమాన్యంతో పాటు అధికార వ్యవస్థకు కూడా బాధ్యత ఉంది" అని కొణతాల తెలిపారు.



### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

అచ్యుతాపురం సెజ్ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాదంలో పలువురు చనిపోవడం బాధాకరమని ఆయన అన్నారు. పీఎంవో సోషల్ మీడియాలో హ్యాండిల్‌లో ఈ విషయం తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50వేలు ఎక్స్ గ్రేషియా అందజేయనున్నట్లు ప్రకటించారు.

### కోటి పరిహారం అందించాలి: జగన్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మాకంపెనీలో జరిగిన ప్రమాదంలో పలువురు మరణించడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్జీ పాలిమర్స్ బాధితులను ఆదుకున్న తరహాలోనే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం అందించాలన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.